బాలల బొమ్మల
నీతి కథలు



పిల్లల నీతి కథలు

పేజ్ మేకింగ్:
సరస్వతి గ్రాఫిక్స్
విజయవాడ

ప్రథమ ముద్రణ:
ఫిబ్రవరి 2009

ముద్రణ:
రమణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ

ముఖచిత్రం:
రమణ

పబ్లిషర్స్:
సరస్వతి పబ్లికేషన్
కాజా వెంకటేశ్వరరావు వీధి,
అరండల్ పేట, సహారా బ్యాంక్ ఎదుట,
విజయవాడ - 2

PILLALA NEETHI KATHALU

Price : 50/-

D.T.P. by
SARASWATHI Graphics
VIJAYAWADA

First Edition:
February 2009


Printed at:
Ramana Offset Printers
VIJAYAWADA

Cover page:
Ramana

Publishers:
SARASWATHI PUBLICATION
Kaza Venkateswara Rao Street,
Arundelpet, Opp. Sahara Bank,
VIJAYAWADA - 2

ఈ పుస్తకం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అయినా పొరపాట్లు దొర్లి ఉండవచ్చును. మాకు తెలిపిన మలిముద్రణలో సవరించగలము

పిల్లల నీతి కథలు



సరస్వతి పబ్లికేషన్


కాజా వెంకటేశ్వరరావు వీధి, అరండల్ పేట,
సహారా బ్యాంక్ ఎదుట, విజయవాడ -2.

విషయసూచిక

లేదు. పైగా పైనుండి పిట్ట సలహాలు, ఇక సహనం నశించింది ఆ మూర్ఖపు కోతులకు. అంతే ఓ వృద్ధ వానరం క్షణాల్లో ఆ పనస చెట్టు ఎక్కి అదే పనిగా హితబోధ చేస్తున్న బుల్, బుల్ పిట్టని గుప్పెడుతో పట్టుకుని పై నుండి క్రిందికి విసరి కొట్టింది బలంగా.

అంతే అంత ఎత్తు నుండి విసురుగా నేలపై పడ్డ ఆ బుల్లి పిట్ట చచ్చి ఊరుకుంది. ఆపై చాలా సేపు మంట రాజేయటానికి విశ్వ ప్రయత్నాలు చేసిన ఆ మక్కటాలు విసుగు పుట్టి, అక్కడి నుండి లేచి, వేరే చోటుకి వెళ్ళిపోయాయి.

నీతి : మూర్ఖులకి సలహాలు ఇచ్చిన వాళ్ళకి ప్రమాదం తప్పదు.



భుజాలెక్కే భూతం

పూర్వం చందొలు అడవులలో "పాపాసురుడు" అనే బ్రహ్మరాక్షసుడు ఉండేవాడు. వాడు పరమక్రూరుడు. తనకు లభించిన మనుషుల్ని నిర్దాక్షిణ్యంగా నమిలి మింగేసేవాడు. వాడి క్రూరత్వానికి ఎందరో బాటసారులు ప్రాణాలు పోగొట్టుకున్నారు.

ఈ రాక్షసుడు ఒక ఎత్తైన బండరాయిపై కూర్చుండి, అటువైపుగా వచ్చిపోయే మనుషుల్ని దగ్గరికి పిలిచి, చంపి తినేసేవాడు. ఇలా ఆ బ్రహ్మరాక్షసుడి దుర్మర్గాలు కొనసాగుతున్నాయి. దాంతో తెలిసిన వాళ్ళెవ్వరూ ఆ మార్గంలో ప్రయాణించేవాళ్ళు కారు. కారణం వాళ్ళకి తెలుసు. ఆ మార్గంలో బ్రహ్మరాక్షసుడు ఉంటాడని.

ఒకరోజున రాజయ్యఅనే పల్లిటూరి వ్యక్తి నగరం నుండి, చందోలు వెళ్తూ, రెండు ఊళ్ళ మధ్యలో ఉన్న చందొలు అడవుల కుండా నడుస్తుండగా, బ్రహ్మరాక్షసుడి పిలుపు వినబడింది.

ఆ భయంకర స్వరానికి రాజయ్యకి హడలు పుట్టింది. సరే ధైర్యాని చిక్కాబట్టికొని, ఆ పిలుపు వినవచ్చిన వైపు నడిచాడు. అక్కడ పెద్ద రాతిబండ మీద తాపీగా కూర్చుని ఉన్న పాపాసురుడు కన్పించాడు.

దాదాపు ఏడు అడుగుల ఎత్తు ఉన్న ఆ బ్రహ్మరాక్షసుడిని చూడగానే రాజయ్యకు గొంతు తడారిపోయింది భయంతో... అప్పుడు ఆ రాక్షసుడు గట్టిగా అరిచాడు.

ఓరి మానవుడా! ఏమిటి నీ పేరు అని, దడ, దడ లాడుతున్న గుండెను నిగ్రహించుకొని, వణుకుతున్న స్వరంతో, రాజయ్య అన్నాడు. అప్పుడు రాక్షసుడు, ఓహో, నీ పేరు రాజయ్య, సరే. నన్ను నీ భుజాలపై ఎక్కించుకొని చందొలు ఊళ్ళోకి తీసుకెళ్ళు అన్నాడు. ఆ మాట వినగా రాజయ్య గుండె జల్లుమన్నది. ఆ పర్వతాకారుడ్ని నేను ఎలా మోయగలను అనుకున్నాడు మనసులో...

అయినా ధైర్యంగా నటిస్తూ, చందొలు గ్రామంలో నీకేంటి పని అన్నాడు. అప్పుడు రాక్షసుడు, రేయ రాజయ్య ఈ మార్గంలో జనాలు ఎవరూ రావటం లేదు, దాంతో నాకు చాలా కాలంగా ఆహారం లేకుండా పోయింది.

నేనే చందొలు గ్రామంలో మకాం వేశాననుకో, కావాల్సినంత మందిని అక్కడే తినవచ్చు అన్నాడు.

రాక్షసుడి మాటలకి రాజయ్య ఉలిక్కి పడ్డాడు. ఓరి– నీ దుంపతెగ, నువ్వు అడవిని వదిలి, గ్రామంలో చేరితే, ఆ గ్రామంలోని జనాల్ని చంపేసి, ఆ గ్రామాన్ని స్మశానంగా మారుస్తావు అని మనసులో అనుకున్నాడు. అయినా పైకి ఏమీ అనకుండా, రాక్షసుడిని చందొలు గ్రామానికి మోసుకు వెళటానికి అంగీకరించాడు.

మోసుకు వెళ్ళను అంటే ఆ రాక్షసుడు ఇక్కడే తనని చంపిపారేస్తాడన్న భయం రాజయ్యకి ఉంది. రాజయ్య తనని భుజాలపై మోసుకొని తీసుకెళ్ళటానికి అంగీకరించగానే రాక్షసుడు, రాజయ్యను తను కూర్చున్న బండ దగ్గరకు రమ్మని పిలిచాడు.

రాజయ్య అలాగే బండ దగ్గరికి వెళ్ళి నిల్చున్నాడు. ఆ రాక్షసుడు గభాల్న బండ మీద నుండి దూకి, రాజయ్య భుజాలపై రెండు వెపులా కాళ్ళు వేసి కూర్చున్నాడు.

రాజయ్య రాక్షసుడి బరువుకి ఊగిపోయాడు. కానీ నిగ్రహించుకొని స్థిరంగా నిలబడ్డాడు.

పాపాసురుడిని మోసుకుని బయలుదేరాడు రాజయ్య. రాక్షసుడి పాదాలు, రాజయ్య పొట్ట దగ్గర దాకా వచ్చాయి. రాజయ్య రాక్షసుడి కాళ్ళు పరిశీలిస్తూ చందొలు గ్రామం వైపు నడకసాగించాడు.

రాజయ్య నడుస్తునే, రాక్షసుడి కాళ్ళు, పాదాలు పరిశీలించసాగాడు. రాక్షసుడి కాళ్ళు, మడమల దాకా దృఢంగా ఉక్కు ముక్కల్లా ఉన్నా– వాడి పాదాలు మాత్రం తమలపాకుల్లా మృదువుగా ఉన్నాయి. ఇది చూసి రాజయ్యకు ఆశ్చర్యం కలిగి, ఆ మాటే రాక్షసుడ్ని అడిగాడు.

అప్పుడు రాక్షసుడు ఇలా చెప్పాడు. రేయ మానవుడా, నాకు ఒక ఋషి శాపం ఇచ్చాడు. ఆ శాపం ప్రకారం నేను నా కాళ్ళతో నడిస్తే తల పగిలి మరణిస్తానని దాంతో నేను, నడవ కుండా, నీలాంటి వాళ్ళ భుజాలు ఎక్కి ఎటైనా వెళ్తుంటాను.



రాక్షసుడి మాటలు విన్న రాజయ్య బుర్రలో ఒక ఆలోచన మెరిసింది. ఈ రాక్షసుడు ఎట్టి పరిస్థితిలో నడిచిరాడు. కారణం వాడు నడిస్తే, ముని శాపం వలన తల పగిలి చస్తాడు. కనుక వీడిని ఎలాగైనా ఎక్కడైనా దింపితే, తను క్షేమంగా వాడి బారి నుండి తప్పించుకోవచ్చు. దాంతో ఆ రాక్షసుడిని ఎలాగైనా తన భుజాలుపై నుండి దింపాలని ఆలోచించసాగాడు. ఇంతలో వాళ్ళకి ఒక చెరువు కనిపించింది.

ఆ చెరువు చూడగానే రాక్షసుడు రేయ రాజయ్య! నన్ను చెరువులోకి తీసుకెళ్ళు స్నానం చేస్తాను అన్నాడు. సరే అని రాజయ్య రాక్షసుడిని మోసుకొని చెరులోకి దిగాడు.

రాక్షసుడు రాజయ్య భుజాల మీద నుండి చెరువులోకి ధడాల్న దూకాడు. ఆపై రాజయ్య చెరువు గట్టు మీదకి వచ్చి, చెరువులో స్నానం చేస్తున్న రాక్షసుడ్ని గమనించసాగాడు. రాక్షసుడు స్నానం చేసి సంవత్సరాలు అయినట్టుంది కాబోలు, హాయిగా ఆ చెరువులో ఈత కొడుతూ, స్నానం చేస్తున్నాడు.

సమయం చూసి రాజయ్య వేగంగా నడుచుకుంటూ చందొలు వైపు బయలుదేరాడు, అది గమినించిన రాక్షసుడు, రాజయ్యని గట్టిగా పిలిచాడు. అయినా రాజయ్య ఆ పిలుపు వినబడనట్టుగా ముందుకు సాగిపోయాడు. అలా వెళ్ళిపోతున్న రాజయ్యను ఆపాలంటే రాక్షసుడు నడిచి తీరాలి. నడిస్తే ఋషి శాపం ఫలించి తల పగిలి చస్తాడు.

కనుక రాక్షసుడు, రాజయ్యని నానా తిట్లు తిడుతూ ఆ చెరువులోనే ఉండిపోయాడు. ఆపై ఎవరు ఆ చెరువు వైపు నుండి వెళ్తున్నా, రాక్షసుడు వాళ్ళని పిలిచి, తనను బయటికి మోసుకెళ్ళమని ప్రార్థించేవాడు.

కానీ బ్రహ్మరాక్షసుడిని, కొరి, కొరి ఎవరు భుజాలకెత్తుకుంటారు. ఆ విధంగా రాజయ్య తెలివి, సమయ స్ఫూర్తి వల్ల రాక్షసుడి పీడా జనాలకి వదిలింది.

నీతి : బలం కన్నా తెలివి గొప్పది.

నాగ పుత్రుడు

ముమ్మిడివరం అనే గ్రామంలో భట్టుమూర్తి అనే వేదపండితుడు ఉండేవాడు. ఆయన భార్య పేరు తులసమ్మ. భట్టుమూర్తి నాలుగు వేదాలు, అష్టాదశ పురాణాలు జోపాసనపట్టిన మహామేధావి. ఆ దేశాన్ని పాలించే రాజుగారు సైతం భట్టుమూర్తిని గౌరవించేవారు. అనేక సార్లు భట్టుమూర్తికి రాజుగారు సన్మానాలు చేసారు.

దాంతో భట్టుమూర్తికి డబ్బు, బంగారం విపరీతంగా పోగుపడింది. భట్టుమూర్తి దంపతులకి అన్నీ పుష్కలంగా ఉన్నాయి. వాళ్ళకున్న ఏకైక లోటు సంతానం లేదు.

ఆ దంపతులు పిల్లలు కలగాలని ఎందరో దేవుళ్ళకి మొక్కుకున్నారు. పుణ్యక్షేత్రాలు తిరిగారు. కానీ ఫలితం శూన్యం. ఒక రోజు భట్టుమూర్తి ఆ ఊరి అమ్మవారి గుడిలో రామాయణం పురాణం చెపుతుండగా, ఒక స్త్రీ ఆయన వద్దకు వచ్చి ఇలా అడిగింది.

"అయ్యా పంతులుగారు! పిల్లలు లేని దశరథుడు ఏదో యాగం చేస్తే రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు పుట్టారని విన్నాను. ఆ యాగం

పేరు ఏమిటో చెపుతారా?" ఆ ఆగంతకురాలు అడిగిన ప్రశ్నకు భట్టుమూర్తి ఉలిక్కి పడ్డాడు. కారణం తనకే పిల్లలు లేరు. తను కూడా ఏదైనా యాగం చేస్తే పిల్లలు పుడతారేమో... అన్న ఆలోచనలో ఉన్నాడు.

అయితే ఏ యాగం చెయ్యాలి అన్న విషయం అతనికి స్పష్టంకాలేదు. తన మనస్సులోకి సందేహాన్ని ఆ స్త్రీ అడగటం వలన ఆయన కలవర పడ్డాడు. ఆయన ఆలోచన నుండి తేరుకొని సమాధానం చెప్పాలనుకుని చూసే సరికి. ఇందాక ప్రశ్న అడిగిన స్త్రీ కనబడలేదు. అప్పుడు అర్థమయింది భట్టుమూర్తికి ఆ స్త్రీ అమ్మవారేనని–



ఆలయంలో పురాణా కాలక్షేపం పూర్తి కాగానే అందరూ ఇళ్ళకీ వెళ్ళిపోయారు. భట్టుమూర్తి కూడా ఇంటికి చేరుకున్నాడు. ఆయన ఇంటికి వెళ్ళేసరికి, ఆయన భార్య తులసమ్మ మంచి నిద్రలో ఉన్నది.

భట్టుమూర్తి భార్యను లేపకుండా, ఆరు బయట వేసి ఉన్న పట్టి మంచంపై పడుకున్నాడు. ఎండాకాలం కావటం వలన చల్లగాలికి వెంటనే నిద్రపట్టింది ఆయనకు.

ఆ రాత్రి నిద్రలో ఎవరో చెప్పినట్లుగా విని పించింది. పిల్లలు కలగాలంటే చేయాల్సిన యాగం పేరు.

అది పుత్రకామేష్టి యాగం. అంతటి పండితుడు అయిన భట్టుమూర్తికి కాలం కలిసివచ్చేదాకా ఏ యాగం చెయ్యాలన్న విషయం తట్టక పోవటం సహజమే.

మర్నాడు ఉదయం భార్యతో చెప్పాడు. మనం త్వరలో పుత్రకామేష్టి యాగం చేద్దాం. ఖచ్చితంగా నీకు సంతానం కల్గుతుంది. భర్త మాటలకి, పిల్లలు పుట్టినంత సంతోషం కల్గింది తులసమ్మకు. అనుకున్న ప్రకారమే ఆ దంపతులు సమస్త బంధువుల్ని పిలిచి ముమ్మిడివారంలోని వాళ్ళ గృహంలో పుత్రకామేష్టి యాగం చేసారు.

ఆ రోజు రాత్రి భట్టుమూర్తికి, ఒక దేవతారుపుడు స్వప్నంలో కనిపించి, త్వరలో నీ భార్య గర్భవతికాగలదు. నీకు పండంటి మగ బిడ్డ జన్మిస్తాడు అని ఆశీర్వదించాడు. భట్టుమూర్తి తెల్లరినాకా భార్యను పిలిచి, తన కొచ్చిన స్వప్నం గురించి చెప్పాడు.

తులసమ్మ చాలా ఆనందించింది. సరిగ్గా సంవత్సరం తిరిగే సరికి భట్టుమూర్తి దంపతులకి బంగారంగా మెరిసిపోయే ఒక సర్పం జన్మించింది. మనిషికి సర్పం పుట్టింది అన్న వార్త విన్న జనాలు భట్టుమూర్తి ఇంటికి తండొప, తండాలుగా వచ్చి, భట్టుమూర్తి సంతానంగా జన్మించిన నాగుపాముని చూసి వెళ్ళసాగారు.

ఇంతలో భట్టుమూర్తికి సంబంధించిన బంధువులు కూడా వచ్చి ఆ బిడ్డను చూసి, కంగారు పడ్డారు.

పాము ప్రమాదకారి, కనుక వెంటనే ఆ నాగ శిశువుని ఎటన్నా దూరంగా తీసుకెళ్ళి వదిలేసి రమ్మని సలహా ఇచ్చారు. కానీ భట్టుమూర్తి భార్య మాత్రం తనుకు పుట్టినది పాము అయినసరే అలాగే పెంచుకుంటానని పట్టు బట్టింది.

భట్టుమూర్తి నీళ్ళు నమిలాడు. బంధువులనీ కాదనలేదు. భార్యను సమాధాన పరచలేదు. చివరికి తులసమ్మ మాటే నెగ్గింది. ఆ సర్పాన్ని పెంచుకొటానికే నిర్ణయం జరిగింది.

ఇలా సంవత్సరాలు గడిచాయి. భట్టుమూర్తి సంతనం అయిన సర్పానికి 18 సంవత్సరాలు నిండాయి. భట్టుమూర్తి ఏనాడు, తన కుమారుడిగా పుట్టిన సర్పాన్ని కనీసం ముట్టుకొవాటం కూడా జరగలేదు. ఆ సర్ప కుమారుడిని తులసమ్మే గుండెలపై పెట్టుకొని సాకీ, 18 ఏళ్ళు పెంచింది.

ఒక రోజు తులసమ్మ భర్తను సమీపించి, ఏమండి మన బిడ్డకు పెళ్ళీడు వచ్చింది. పెళ్ళి చెద్దాం అన్నది. భార్య మాటలకి భట్టుమూర్తి గతుక్కుమన్నాడు. ఏమేవ్! పాముకి ఎవరైనా పిల్లను ఇస్తారా? నీ పిచ్చిగాని అన్నాడు బాధగా.

భర్త మాటల్ని ఖతరు చెయ్యకుండా, తులసమ్మ తన కుమారుడికి పెళ్ళి చేసి తీరాలని పట్టుపట్టింది. సరే భార్యను బాధపెట్టటం ఇష్టం లేక, కోడలి కోసం అన్వేషణ ప్రారంభించాడు భట్టుమూర్తి. ఆయన వెంటనే ప్రయాణం మొదలు పెట్టాడు.

మొదటిగా సింహపురి గ్రామంలో ఉంటున్న తన స్నేహితుడు శేషాద్రిని కలిసి, తన కుమారుడికి పెళ్ళి చేయాలని అనుకుంటున్నానని చెప్పాడు. తన కుమారుడు 'పాము' అని పొరపాటున కూడా మిత్రుడికి చెప్పలేదు భట్టుమూర్తి.

ఆయన మాట విన్న శేషాద్రి తన కుమార్తె నీలాంబరిని భట్టుమూర్తి కుమారుడికి ఇచ్చి వివాహం చేస్తానని మాట ఇచ్చాడు. ఇంకేం కోడలు దొరికింది.

ఆ రోజుల్లో కన్యాశుల్కం అనే ఆచారం ఉండేది. కన్యాశుల్కం అంటే, పెళ్ళికూతురి తల్లి, దండ్రులకు కొంత ధనాన్ని చెల్లించి, పెళ్ళికుతురిని స్వగృహానికి తీసుకు వెళ్ళి తమ కుమారుడికి ఇచ్చి పెళ్ళి చేసేవారు పెళ్ళి కుమారుడి తల్లి దండ్రులు.



అందువల్ల భట్టుమూర్తి కూడా భారీగా కన్యాశుల్కం చెల్లించి, మిత్రుడి కుమార్తె నీలాంబరిని తీసుకొని ముమ్మిడివరం గ్రామం చేరాడు. కాబోయే కోడల్ని చూసి, తులసమ్మ బాగా ఆనందపడింది. ఓనుమరి కోడలు చక్కని చుక్క, సుగుణాల రాశి అయితే ఏ అత్తగారికి ఆనందంగా ఉండదు. సరే ఒక మంచి ముహూర్తం నిర్ణయించబడింది.

ఇది ఇలా ఉండగా, ఆ ఊరిలోని అమ్మలక్కలు భట్టుమూర్తి కాబోయే కోడల్ని కలిసి, పెళ్ళి కొడుకు మనిషి కాదని పాము అనీ, ఆ పెళ్ళి చేసుకొవద్దనీ సలహాలు చెప్పారు.

కానీ పెళ్ళి కూతురు నీలాంబరి ఇలా అన్నది. మా తండ్రిగారు, భట్టుమూర్తిగారికి పిల్లనిస్తానని వాగ్దానం చేసారు. కనుక ఏం జరిగినా సరే భట్టుమూర్తి గారి సర్ప పుత్రుడిని పెళ్ళాడి తీరతానని. సరే నిర్ణయించిన ముహూర్తానికే భట్టుమూర్తిగారి నాగ పుత్రుడికి, నీలాంబరికి వివాహం ఘనంగా జరిగింది. మనిషికి, సర్పానికి జరిగిన ఈ విచిత్ర వివాహం చూడాటానికి వేలాది జనం తరలి వచ్చారు.

వివాహం అయింది. నీలాంబరి ఒక ఆడదైన ధర్మపత్నిలాగానే భర్త అయిన సర్పానికి అన్ని రకాల సేవలు చేసేది. కోడలు రావటం వలన తులసమ్మకి కొడుకు బాధ్యత తగ్గి విశ్రాంతి దొరికింది. ఇలా రోజులు గడుస్తున్నాయి.

ఒక నాటి పౌర్ణమిరాత్రి సర్పము క్రింది పడక గదిలోని నిద్రిస్తుండగా నీలాంబరి ఒంటిరిగా మేడ పైకి వెళ్ళింది. చల్లని వెలుగులు చిందిస్తున్న చంద్రుడిని చూసి మైమరచి పోయింది ఆమె. ఇంతలో ఎవరో మేడ మెట్లు ఎక్కి పైకి వస్తున్న శబ్దం వినపడి ఎవరా అని తల తిప్పి చూసింది నీలాంబరి.

ఒక అందాల యువకుడు కనిపించాడు. అతడు ఎవరో నీలాంబరికి అర్థం కాలేదు. అతడు నేరుగా నీలాంబరి దగ్గరికి వచ్చి కౌగిలించుకోవాలని ప్రయత్నించగా నీలంబరి అతన్ని దూరంగా త్రోసివేసి, ఆగ్రహంగా ఇలా అన్నది.


ఓరీ పాపాత్ముడా ఎవరు నీవు, నన్ను తాకాలని చూస్తున్నావు? జాగ్రత్త. ఆమె ఆగ్రహాన్ని చూసిన ఆ యువకుడు చిరునవ్వులు చిందిస్తూ, ఓయీ నీలాంబరి నేను ఎవరనుకుంటున్నావు. నేను నిన్ను ధర్మశాస్త్రపరంగా పెళ్ళాడిన నాగ కుమారుడిని అన్నాడు.

కానీ నీలాంబరి, ఆ యువకుడి మాటల్ని నమ్మలేనట్టు చూసింది. అప్పుడు ఆ యువకుడు చెప్పటం ప్రారంభించాడు. దేవీ, నేను శాప కారణంగా ఇలా సర్ప రూపంలో జన్మించాను.

ఎవరైనా ఇష్టపూర్వకంగా నన్ను వివాహమాడితే, వివాహం జరిగిన సంవత్సరానికి మనిషి రూపం పొందగలను. అయితే రాత్రిళ్ళు మాత్రమే మనిషి రూపం. పగలు సర్పంగానే ఉంటాను అన్నాడు.

నీలాంబరి కళ్ళముందే క్రింద పడక గదిలో తల్పం మీద ఉన్న పాము శరీరంలోకి ప్రవేశించి అదృశ్యం అయ్యాడు ఆ యువకుడు. దీనికి నీలాంబరి చాలా సంతోషించింది. ఆ మర్నాడు ఉదయం ఈ విషయాన్ని అత్త, మామలకు తెల్పింది.





వాళ్ళు ఈ సంగతిని విని మహా ఆనందించారు. ఒక రోజు రాత్రి నీలాంబరి, యువకుడు మేడపై వెన్నెలలో విహరిస్తుండగా, భట్టుమూర్తి హఠాత్తుగా కుమారుడి పడక గదిలో ప్రవేశించి, కుమారుడి తల్పంపై ఉన్న సర్ప దేహాన్ని చూసి, ఆహా! నేను కనుక ఈ పాము శరీరాన్ని దహనం చేసినట్టు అయినచో నా కుమారుడు తప్పకుండా మానవ దేహంలోనే ఉండి తీరాతాడు అనుకున్నాడు.

వెంటనే ఆ పాము శరీరాన్ని ఇంటికి దూరంగా తీసుకెళ్ళి, మంట తయారు చేసి ఆ మంటల్లో ఆ పాము దేహాన్ని వేసి దహనం చేసి ఇంటికి వచ్చాడు. మేడపై నుండి క్రిందికి వచ్చిన భట్టుమూర్తి కుమారుడికి తన సర్ప దేహం కనిపించక ఏమైది అది అని తల్లి, దండ్రుల్ని అడిగాడు. అప్పుడు భట్టుమూర్తి కుమారా! శాపవ శాత్తు నీకు కల్గిన సర్ప శరీరాన్ని నేను దహనం చేసాను.

కావున నీవు ఇకపై ఈ మనవ రూపంలోనే ఉండవచ్చు అన్నాడు. తండ్రి మాటలకు ఆనందించిన యువకుడు, తండ్రీ, మీరు నా సర్పదేహాన్ని మంటల్లో వేసి మంచి పని చేసారు.

నాకు ఇవ్వబడ్డ శాపంలో పరిహారం ప్రకారం, ఎవరైనా నా సర్ప దేహాన్ని నాకు తెలియకుండా దహనం చేసినట్లు అయిన నాకు ఇకా ఏనాటికీ సర్పరూపం రాదు అన్నాడు. దాంతో భట్టుమూర్తి ఆంనందగా కుమారుడిని కౌగిలించుకున్నాడు.

తులసమ్మ కన్నీళ్ళు, చెక్కిళ్ళపై దొర్లుతుండగా, కొడుకు, కోడల్ని ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నది. తనకి సర్ప రూపంలో బిడ్డ జన్మించినా మాతృపాశానికి రూపంతో పని లేదు అని పామును బిడ్డగా పెంచిన తులసమ్మ నిజంగా మతృదేవత.

నీతి : రూపం శాశ్వతం కాదు.

చేటు తెచ్చిన సలహా


పూర్వం వేజండ్ల అనే గ్రామంలో పుల్లయ్య అనే నేత కార్మికుడు ఉండేవాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు. పుల్లయ్య మగ్గం మీద బట్టలు నేసి, దగ్గరలో ఉన్న పట్టణంలో అమ్ముకుని జీవనం సాగించేవాడు. ఉన్నంతలో హాయిగా జీవితం గడుపుతున్న పుల్లయ్యకి ఒకసారి ఒక సమస్య ఏర్పడింది. అదేంటంటే ఒకసారి అతని దగ్గరున్న మగ్గం విరిగి పోయింది. మళ్ళీ ఆ మగ్గాన్ని బాగుచేస్తేకానీ బట్టలు నేయలేడు. బట్టలు నేస్తేకానీ రోజు గడవదు.

దాంతో పుల్లయ్య తన గ్రామానికి దగ్గరలో ఉన్న అడవికి వెళ్ళి మగ్గం కోసం ఒక చెట్టును కొట్టి, చెక్కలు తెద్దామని అనుకున్నాడు. దాంతో ఉదయమే నిద్రలేచి, చద్దన్నాం మూట కట్టుకొని, భుజాన గొడ్డలి వేసుకొని అడవికి బయలుదేరాడు.

అడవికి చేరి, అక్కడున్న చెట్లను బాగా పరిశీలించాడు. ఏ చెట్టు తాలుకా చెక్క తన మగ్గానికి పనికి వస్తుందో అని. ఒక మంచి టేకు చెట్టుని ఎన్నుకొని దాన్ని నరకాటానికి గొడ్డలి ఎత్తాడు. సరిగ్గా అప్పుడు

అతనికి వినబడింది ఒక మానవ స్వరం, ఆ స్వరం చెప్పిన మాట, మానవా, ఈ చెట్టుని నరకటం మానవా?

పుల్లయ్య ఆశ్చర్యపడి చుట్టు చూసాడు. ఎవరూ కనబడలేదు. ఈ మాట అన్నది ఎవరో అర్ధంకాక, పుల్లయ్య కాస్సేపు అలానే నిల్చుని, మళ్ళీ చెట్టు నరకటానికి గొడ్డలి ఎత్తి, చెట్టుపై వేశాడు. అంతే ఒక దేవతా స్త్రీ పుల్లయ్య ముందు ప్రత్యక్షమైంది. ఆమెను చూసి పుల్లయ్య ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు.



అప్పుడు ఆ దేవతా స్త్రీ పుల్లయ్యను చూసి ఇలా అన్నది. నాయనా పుల్లయ్యా! నేను ఈ చెట్టు మీద ఉంటున్న అడవి దేవతను, చాలా ఏళ్ళుగా ఈ చెట్టుపై నివశిస్తున్నాను. నీవు దయచేసి ఈ చెట్టుని కొట్టకుండా వదిలెయ్యి.

వనదేవత మాటలకి తేరుకున్న పుల్లయ్య ఆమెతో ఇలా అన్నాడు–

అమ్మా దేవతా! నేను ఒక పేద నేత కార్మికుడిని. నా మగ్గం విరిగిపోయింది. అది బాగుచేసుకుంటేగానీ, నేను బట్టలు నెయ్యలేను. బట్టలు నేసి అమ్ముతేకానీ, నాకు పూట గడవదు. అతని మాటలకి జాలిపడి వనదేవత పుల్లయ్యతో ఇలా చెప్పింది.

బాబూ! నీవు ఈ చెట్టుని నరకటం మానేస్తే నీకు ఏదైనా వరం ఇస్తాను. సరేనా!

వనదేవత మాటలకు ఆనందించిన పుల్లయ్య, ఏ వరం కోరుకోవాలో మా గ్రామంలోకి వెళ్ళి అందర్నీ అడిగి వచ్చి అప్పుడు కొరతా నిన్ను వరం అన్నాడు వనదేవతతో. ఆమె సరే అని అంతర్ధానం అయింది.

పుల్లయ్య వేగంగా నడుచుకుంటూ తన గ్రామానికి బయలుదేరాడు. మధ్య మార్గంలో అతడికి అతని ముఖ్య స్నేహితుడు నాగరాజు కన్పించాడు. హడావుడిగా వెళ్తున్న పుల్లయ్యను చూసి పలకరించాడు.

పుల్లయ్య తను అడవికి వెళ్ళిన విషయం, వనదేవత వరం ఇస్తానన్న విషయం చెప్పాడు. ఏ వరం కోరుకుంటే బాగుంటుందంటావు అని మిత్రుడిని సలహా అడిగాడు.

పుల్లయ్య చెప్పిన విషయం విన్న నాగరాజు ఇలా అన్నాడు. పుల్లయ్య నువ్వు రాజువి కావాలని ఆ దేవతను కోరుకో, అప్పుడు నేను నీకు మంత్రిగా పనిచేస్తాను.

మిత్రుడి సలహా విన్న పుల్లయ్య నా భార్యను కూడా సలహా అడిగి ఆ తర్వాత ఏ వరం కోరుకోవాలో నిర్ణయించుకుంటాను అన్నాడు.

అప్పుడు నాగరాజు ఇలా అన్నాడు. పుల్లయ్య ఆడవాళ్ళని సలహాలు అడగ కూడాదు. వాళ్ళకి బుద్ధిసరిగా ఉండదు. కనుక నీ భార్యను సలహా అడగటం శుద్ధదండగా, పైగా ప్రమాదకరం. అయినా పుల్లయ్య ఏమీ పట్టించుకోకుండా అక్కడి నుండి బయలు దేరి భార్య దగ్గరకు వెళ్ళి వనదేవత తనకి వరం ఇస్తానన్న విషయం చెప్పాడు.

అప్పుడు పుల్లయ్య భార్యకి, తన స్నేహితుడు, రాజుగా అయ్యేవరం ఇమ్మని అడగమని సలహా ఇచ్చాడని చెప్పాడు. పుల్లయ్య చెప్పింది విని, అతని భార్య ఇలా అన్నది–

ఒక దేశానికి రాజు అవటం అంటే వినటానికి గొప్పగా అనిపించవచ్చు.

కానీ ఆపదవి ఎంతో కష్ట పురితం. శత్రురాజుల నుండి యుద్ధాలు ఎదుర్కొవలసి రావచ్చు. దేశంలో జరిగే కుట్రల్ని ఎదుర్కొవాల్సిరావచ్చు. పైగా ప్రజలకి వచ్చే అన్ని రకాల సమస్యన్ని పరిష్కరించాల్సి ఉంటుంది. ఎన్ని సుఖాలున్నా, మనశ్శాంతి ఉండదు.

అయితే ఏం వరం కోరుకోమంటావు అన్నాడు పుల్లయ్య. అప్పుడు పుల్లయ్య భార్య, ఏదైనా పని కొచ్చేవరం కోరుకో అన్నది. పని కొచ్చేవరం అంటే ఎలా ఉండాలి. అని అడిగాడు పుల్లయ్య. వరం నీకు, నీ వృత్తిలో పనికి వచ్చేలా ఉండాలి.

అదేలాగంటే నీకు ఇంకో తల, ఇంకో రెండు చేతులు ఇవ్వమని ఆ దేవతను కొరావనుకో నువ్వు ఏకకాలంలో రెండు మగ్గాలపై పని చేసి, ఎక్కువ బట్టలు నేసి చాలా సంపాదించుకోవచ్చు అన్నది అతని భార్య.

పుల్లయ్యకు భార్య ఇచ్చిన సలహా బాగా నచ్చింది. వెంటనే అడవికి వెళ్ళి, వనదేవతను రెండు చేతులు, ఒక తల అదనంగా ఇవ్వమని వరం కోరాడు.

వెంటనే ఆ వనదేవత తథాస్తు! అన్నది అంతే పుల్లయ్యకు అసలు తల వెనక భాగంలో ఇంకో తల, అసలు చేతుల క్రింద వెనుక వైపుగా రెండు చేతులు ఏర్పాడ్డాయి. వాటిని చూసి చాలా ఆనందించిన పుల్లయ్య వేగంగా నడుస్తూ తన గ్రామంలోకి ప్రవేశించాడు.

విచిత్రంగా కనిపించిన పుల్లయ్యను చూసి కుక్కలు పెద్దగా మొరిగాయి. ఊళ్ళోని జనాలు పుల్లయ్యను గుర్తు పట్టలేదు. పైగా అతడు మారురూపంలో ఉన్న రాక్షసుడేమో అని అనుమానించి రాళ్ళతో కొట్టి ఊరునుండి తరిమి వేసారు. అంతా చూస్తున్న పుల్లయ్య స్నేహితుడు చాలా బాధపడి ఇలా అనుకున్నాడు.

ఈ పుల్లయ్య తనకి వచ్చిన బంగారంలాంటి అవకాశాన్ని వృథా చేసుకొని, భార్య చెప్పిన బుద్ధితక్కువ సలహా విని వెర్రి వరం కోరి, కష్టాలను కొరి, కొరి ఆహ్వానించాడు. నేను చెప్పిన ప్రకారం వరం కొరి ఉంటే, హాయిగా ఈ పాటికి ఈ రాజ్యానికి రాజు అయి పాలిస్తూ ఉండేవాడు. అంత వాడి విధి వ్రాత ప్రకారమే జరుగుతుంది.

నీతి : ఇతరులు చెప్పే సలహాలు గుడ్డిగా అమలు చేస్తే ప్రమాదాలు తప్పవు.

ఏనుగుని గెల్చిన కుందేలు

పూర్వం నీలగిరి అడవుల్లో గజేంద్ర అనే ఒక ఏనుగు రాజు తన మందతో కలిసి నివశిస్తూ ఉండేది. ఒకసారి అనావృష్టి పరిస్థితులు ఏర్పడి ఆ అడవిలోని పచ్చటి చెట్లలన్నీ ఎండిపోయాయి. చిన్న చిన్న నీటి గుంటల సైతం ఎండి పోయాయి.

దాంతో గజేంద్రుడికి అతని ఏనుగులకి ఆహారం, నీరు దొరకటం గగనం అయిపోయింది. దాంతో అన్ని ఏనుగులు కలిసి తమ రాజైన గజేంద్రుడి దగ్గరికి గుంపుగా వెళ్ళి ప్రస్తుతం అడవిలో ఏర్పడ్డ కరువు వాతావరణం గురించి ఈ విధంగా వివరించాయి.

ఓ రాజా! గత రెండు సంవత్సరాలుగా మన అడవిలో ఒక్క చుక్క వర్షం కూడా పడటం లేదు. ఎండాకాలంలో వర్షం అన్న మాట లేకున్నా సీతాకాలం, వర్షాకాలాల్లో సైతం వాన రాక పోవటం వల్ల ఈ అడవిలో పచ్చదనం అనేది కనుచూపు మేరలో కనిపంచటంలేదు. అందువల్ల మన ఏనుగుల జాతి నీరు, ఆహారం లేకుండా అలమటించి పోతున్నాం. దానికి గజేంద్రుడు ఇలా సమాధానం ఇచ్చాడు.

నా ప్రియమైన సోదరులారా! ప్రస్తుతం మన అడవిలో ఏర్పడ్డ అనావృష్టి పరిస్థిలులు తద్వారా ఏర్పడ్డ కరువు పరిస్థితులు నాకు తెలుసు. అయితే ఈ పరిస్థితులలో మనం ఏమి చెయ్యాలో మన మంత్రిగారిని అడిగి తెసుకుందాం. అప్పుడు ఏనుగుల మంత్రి గణేశ్ లేచి నుంచొని రాజుగారికి నమస్కరించి ఇలా అన్నాడు.


ఓ ప్రభూ! నేడు మన ఏనుగుల జాతి అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నది.

ఇలాంటి పరిస్థితులలో మనం నీరు, ఆహారం దొరికే ఇంకొక ప్రదేశానికి వెళ్ళటం మినహా గత్యంతరం లేదు. మంత్రి గణేశ్ మాటలకు అక్కడ సమావేశమైన ఏనుగులన్ని తమ అంగీకారాన్ని తెలిపాయి. అప్పుడు ఏనుగుల రాజు గజేంద్ర మంత్రి గణేశ్‌ని ఇలా అడిగాడు.

మంత్రిగారూ ఎప్పుడు నీటి కరువు లేని మంచి ఆహారం లభించే ప్రదేశం ఎక్కడ ఉన్నది, ఎంత దూరంలో ఉన్నది అన్న విషయాలు మీకు

తెలిస్తే చెప్పండి. అప్పుడు మంత్రి గణేశ్ ఇలా అన్నాడు. ఇక్కడికి 200 మైళ్ళు దూరంలో ఉన్న నల్లమల అడవుల్లోని చంద్రసాగరం అనే చిన్న వాగు ఉన్నది. ఆ వాగు సంవత్సరం పొడుగునా ప్రవహిస్తూ ఉంటుంది. ఆ వాగు ఒడ్డున అనేక రకాలైన ఫల వృక్షాలు ఉన్నాయి.

కనుక మనం అక్కడికి వలస వెళ్ళి నట్లైతే మన కరువు సమస్య తీరిపోతుంది. గణేశ్ సలహాకు రాజు గజేంద్రుడుతో సహా అక్కడ సమావేశమైన అన్ని ఏనుగులు హర్షధ్వానాలు చేశాయి.



ఆ తర్వాత అన్ని ఏనుగులు అంటే పిల్ల ఏనుగులతో సహా ముసలి ఏనుగుల వరకూ రాజు గజేంద్రుని వెనుకగా బయలుదేరిన వేలాది ఏనుగుల గుంపు కొన్ని వారాల పాటు ప్రయాణం చేసి నల్లమల అడవులలోని చంద్రసాగర్‌ని చేరుకున్నాయి.

చంద్రసాగర్‌ని చూడగానే ఏనుగులకి ఒక్కసారిగా ప్రాణం తిరిగి వచ్చినట్లుగా అనిపించింది.

కారణం చాలా వెడల్పు కలిగి మైళ్ళు కొద్దీ పొడవునా ప్రవహిస్తున్న ఆ మంచి నీటి వాగు ఆ వాగుకి రెండు వైపులా ఉన్న వెలగపండ్ల చెట్లు, మామిడి పండ్ల చెట్లు, నేరేడు పండ్ల చెట్లు చూసి ఏనుగులు విపరీతమైన ఆనందాన్ని అనుభవించాయి.

దాదాపుగా రెండు మూడేళ్ళుగా సరైన తిండి తిప్పలకు నోచుకోకుండా ఉన్న తమకు ఈ చంద్రసాగరం ఒక వరంలా కనిపించింది. దాంతో ఆ ఏనుగులన్నీ ఆ నాటి నుండి ఆ వాగు చుట్టు ప్రక్కల ఉన్న చెట్ల మధ్య నివాసం ఏర్పరచుకొని ఆ వాగులో స్నానాలు చెయ్యటం నీళ్ళతో ఆడుకోవటం లాంటి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగించేవి. ఇది ఇలా ఉండగా ఆ వాగు ఒడ్డునే ఉన్న కలుగుల్లో అనేక కుందేళ్ళు నివసిస్తూ ఉండేవి.

ఏనుగులు ఆ ప్రాంతానికి పెద్ద సంఖ్యలో వలస వచ్చే వరకు ఆ కుందేళ్ళకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఎప్పుడైతే ఏనుగులు ఆ ప్రాంతంలో విచ్చల విడిగా తిరగటం మొదలు పెట్టాయో ఆ వాగు ఒడ్డున నివసించే కుందేళ్ళకు ప్రాణాపాయం ఏర్పడింది.

అది ఎలాగంటే వాగు గట్టు పొడవునా ఉన్న బొరియల్లో నివాసం ఉంటున్న కుందేళ్ళు నీళ్ళు తాగటానికి గుంపులు గుంపులుగా వచ్చే వందలాది ఏనుగుల కాళ్ళు క్రింద పడి చనిపోసాగాయి. దాంతో కుందేళ్ళు సంఖ్య సగానికి సగం తగ్గి పోయింది.


ఒకరోజున ఏనుగులు అక్కడికి రాని సమయంలో కుందేళ్ళన్ని ఒక సమావేశం ఏర్పాటు చేసుకున్నాయి. ఆ సమావేశానికి కుందేళ్ళు రాణి శశికళ అధ్యక్షత వహించింది. ఆ వాగు ఒడ్డు బొరియల్లో ఉంటున్న సమస్త కుందేళ్ళు గురించి ఏం చెబుతుందో విందామని ఆసక్తిగా ఎదురు చూడసాగాయి.

అప్పుడు కుందేళ్ళ రాణి శశికళ ఇలా అన్నది. ఓ నా ప్రియమైన కుందేలు బంధువులారా! మనం నివాసం ఉంటున్న ఈ చంద్రసాగర వాగు మన పూర్వీకుడు, చంద్రుడు గురించి ఘోర తపస్సు చేసి చంద్రుడి వరంగా పొందాడు.

అలాంటి మన పూర్వీకుల ఆస్తిగా మనకి సంక్రమించిన ఈ చంద్రసాగర వాగుని ఆ భయంకరమైన ఏనుగులు ఆక్రమించివేశాయి. వాటి కాళ్ళ క్రిందపడి మన కుందేళ్ళు కొన్ని వందల సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకున్నాయి. కాబట్టి మన ప్రాణరక్షణకు ఆ ఏనుగుల్ని ఈ ప్రాంతానికి రాకుండా మీలో ఎవరైనా చేయగలరా? అని ప్రశ్నించింది.

ఆ ప్రశ్నకు సమాధానంగా ఒక ముసలి కుందేలు లేచి నుంచొని ఆ ఏనుగుల్ని ఈ వాగు ఒడ్డుకి రాకుండా నేను నిరోధించ గలను. అని ప్రకటించింది.

అప్పుడు కుందేళ్ళ రాణి శశికళ ఆ ముసలి కుందేలును దగ్గరకు పిలిచి నీవు ఆ ఏనుగుల్ని ఇక్కడకు రావటం నిరోధించ గలిగితే మన కుందేళ్ళ జాతి మొత్తం నీకు ఎల్లప్పుడూ ఋణపడి ఉంటుంది అన్నది. ఆ తర్వాత కుందేళ్ళన్ని ఎవరి బొరియలకు వాళ్ళు వెళ్ళిపోయారు.



ఆ మర్నాడు ఉదయం ఏనుగుల గుంపు చంద్రసాగరం వాగుకి తమ నివాస ప్రాంతం నుండి బయలు దేరాయి. అవి సగం దూరంలో ఉండగా వాటికి ఎత్తైన ఒక బండరాయి మీద నుంచొని ఉన్న ముసలి కుందేలు కనిపించింది.

ఏనుగుల గుంపుకు ముందుగా నడుస్తున్న రాజు గజేంద్రుడిని దగ్గరకు రమ్మని పిలిచింది ఆ ముసలి కుందేలు. తనని ఆ కుందేలు అలా రమ్మని పిలవటం ఆసక్తి కరంగా అనిపించి ఏనుగుల రాజు గజేంద్రుడు ఆ ముసలి కుందేలు ఉన్న రాయి వద్దకు వెళ్ళాడు.

50 అడుగుల ఎత్తు ఉన్న ఆ బండరాయి మీద నిలబడటం వల్ల ఆ ముసలి కుందేలు గజేంద్రుడు కన్నా ఎత్తులో ఉండటం జరిగింది. తనకు దగ్గరగా వచ్చిన గజేంద్రతో ముసలి కుందేలు ఇలా అన్నది.

"ఓయీ! గజరాజా! ఈ రోజు నుంచి నీవు, నీ పరివారం ఈ చంద్రసాగర వాగు దగ్గరకి రాకూడదు. మీరు రావటం వల్ల మీ కాళ్ళ క్రింద పడి రోజూ డజన్ల కొద్దీ కుందేళ్ళు మరణిస్తున్నాయి. కుందేలు

మాటలకు ఆగ్రహించిన గజేంద్రుడు ఈ వాగు దగ్గరకు మమ్మల్ని రావద్దు అని చెప్పటానికి నీకేమి హక్కు ఉన్నది అని అన్నది.

అప్పుడు ముసలి కుందేలు ఈ చంద్రసాగర వాగు యజమాని అయిన చంద్రుడు మిమ్మల్ని ఈ వాగులోకి రావద్దని నన్ను చెప్పమన్నాడు. నా మాటలు లెక్కచెయ్యకుండా మీరు వాగులో దిగినట్లయితే ఆ చంద్రుడు మిమ్మల్ని అందరిని నాశనం చేస్తాడు అన్నది.

కుందేలు మాటలకు భయపడ్డ గజేంద్రుడు, కుందేలుతో ఇలా అన్నాడు. నేను చంద్రుడిని క్షమాణ కోరుకుంటాను ఆయన ఎక్కడ ఉన్నాడో చెప్పు.

అప్పుడు కుందేలు ఈ రోజు పౌర్ణమి కదా ఈ రోజు రాత్రికి చంద్రుడు ఈ వాగు మీదకు వస్తాడు. అప్పుడు నీవు వచ్చి ఆయన్ని క్షమించమని కోరుకో అన్నది.

ముసలి కుందేలు చెప్పినట్లుగానే, ఆ రోజు రాత్రి గజేంద్రుడు చంద్రసాగర వాగు దగ్గరికి వచ్చింది. ఆ సరికే అక్కడ ఉన్న కుందేలు గజేంద్రుడు దగ్గరకు వచ్చి అదిగో ఆ వాగు పైన చంద్రుడు ఉన్నాడు చూడు అన్నది.

ఆ బుద్ధిలేని గజేంద్రుడు వాగులో పడ్డ చంద్రుడి నీడను చూసి, నిజంగా చంద్రుడే, ఆ వాగులో ఉన్నాడని భ్రమించింది.

ఇంతలో ఆ వాగులో అలలు ఏర్పడి అందులో కనబడుతున్న చంద్రుడి ప్రతిబింబం వణికింది. అది గజేంద్రుడు గమనించాడు. ఆ విషయాన్ని పసి గట్టిన ముసలి కుందేలు, ఓ గజేంద్రా! చంద్రుడు నిన్ను చూసి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నాడు.

నీవు తక్షణం ఆయన్ని క్షమాపణాలు కోరి, ఈ ప్రాంతం నుండి నీ పరివారంతో సహా వెళ్ళిపోతానని చెప్పు అన్నది. దాంతో ఆ మంద బుద్ధి గల గజేంద్రుడు చంద్రుడి నీడకు, ఒడ్డునుంచే తల వంచి క్షమాపణాలు కోరి వేగంగా అక్కడి నుండి వెళ్ళిపోయింది.

ఆ రాత్రే గజేంద్రుడు తన పరివారంతో ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళి పోయింది. దాంతో ఏనుగుల పీడవదలి, కుందేళ్ళన్నీ హాయిగా నిట్టూర్చాయి.

ఆ నాటి నుండి కుందేళన్నీ స్వేచ్ఛగా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ఆ చంద్రసాగర్ ఒడ్డున ఆనందంగా తిరగసాగాయి.

నీతి : యుక్తి ఉంటే ఎంత అసాధ్యాన్ని అయినా సాధించవచ్చు.

బలిదానం

కంకిపాడు అనే గ్రామంలో శర్మ అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు చాలా తెలివి గలవాడు. కానీ డబ్బు కోసం ఎంత నీచానికైనా దిగజారే కక్కూర్తి గల మనిషి. ఈ శర్మ ఏంచేసినా డబ్బు కోసమే చేస్తాడు. వడ్డీ వ్యాపారం చేసి, అధిక వడ్డీ గుంజి బాగా సంపాదించాడు. గ్రామంలో ఒక ఇల్లు, దగ్గరలో ఉన్న పట్టణంలో రెండు ఇల్లు నిర్మించుకున్నాడు.

ఒకరోజు ఆ గ్రామానికి నలుగురు వ్యాపారులు వచ్చి బట్టలు, ఇతర సుగంధ ద్రవ్యాలు అమ్మి బాగా డబ్బు సంపాదించారు. ఆ తర్వాత సంపాదించిన డబ్బుని వజ్రాలుగా మార్చి, నాలుగు వజ్రాలు కొన్నారు. ఒక్కొక్క వ్యాపారీ, ఒక వజ్రం చొప్పున తీసుకున్నారు.

ఆ తర్వాత వాళ్ళు వాళ్ళుండే నగరానికి తిరుగు ప్రయాణం కట్టారు. అయితే కాకతాళాయంగా శర్మ కూడా ఆ రోజే నగరానికి ప్రయాణం కట్టాడు. ముందు వ్యాపారులు నడుస్తున్నారు. వాళ్ళ వెనుకగా కాస్త దూరంలో శర్మ నడుస్తున్నాడు.

ఇంతలో వాళ్ళకి ఒక అడవి ఎదురయింది. ఆ అడవిలో దొంగల బాధ అధికం అని ఆ వ్యాపారులు విని ఉన్నారు. దొంగలు ఎదురు పడి బాధిస్తే, వాళ్ళకి చిక్కాకుండా ఆ వజ్రాలని ఎలా కాపాడుకోవాలి అని ఆ వ్యాపారులు చింతించసాగారు. వాళ్ళు ఒక బావి గట్టున ఆగి దాహం తీర్చుకొన్నారు.

అప్పుడు వారిలో ఒక వ్యాపారికి తట్టింది. ఆ వజ్రాల్ని దొంగల కటం పడకుండా దాచే విధానం. అతను వెంటనే మిగిలిన వర్తకులతో ఇలా అన్నాడు.

సోదరులారా! మనం మన వజ్రాలని మింగేసామంటే ఆ దొంగలు చచ్చిన అవి ఎక్కడున్నాయో తెలుసుకోలేరు. ఆ తర్వాత మన నగరం చేరి

నాక, ఇళ్ళకు వెళ్ళి ఏదో విధంగా ఆ వజ్రాన్ని పొట్ట నుండి బయటికి తీసుకోవచ్చు. అతని మాటలకి మిగిలిన వ్యాపారులు సంతోషించి, బావిలోంచి కాసిని నీళ్ళు తొడి ఒక్కొక్క వర్తకుడు, ఒక్కొక్క వజ్రాన్ని మింగి కాసిని నీళ్ళు తాగారు. వాళ్ళ వెనకగా వస్తూ, వాళ్ళ మాటలు విన్న శర్మ ఈ విధంగా ఆలోచించాడు.

“వీళ్ళకి ఇప్పుడు దొవలో దొంగలు ఎదురుపడటం ఖాయం. అప్పుడు దొంగలు వీళ్ళని సోదా చేసి ఏమీ దొరక్కాపోతే, వీళ్ళను చంపేస్తారు. అప్పుడు చచ్చిన వీళ్ళని వదిలేసి దొంగలు వెళ్ళిపోతారు. అప్పుడు నేను వీళ్ళ పొట్టలు చీల్చి, వీళ్ళ పొట్టల్లో ఉన్న ఆ నాలుగు వజ్రాలు కులాసాగా సొంతం చేసుకుంటాను.

శర్మ ఇలా ఆలోచిస్తూ, వ్యాపారుల వెనుకగా నడుస్తున్నాడు. శర్మ తమ వజ్రాలపై కన్ను వేసాడని తామ చావుకై గోతికాడ నక్కలా ఎదురుచూస్తున్నాడని పాపం ఆ అమాయక వ్యాపారులకి తెలియదు.

అయితే అనుకొని విధంగా ఆ వ్యాపారుల్ని, శర్మని దొంగలు ఎదుర్కొలేదు. ఆ అడవిలో ఉండే ఒక అనాగరిక అడవి మనుషులు ఎదుర్కొన్నారు. ఆ ఆట వికుల దగ్గర ఒక రాబందు ఉన్నది. అది ఎవరైనా, సంపదతో ఆ మార్గాన వెళుతుంటే పెద్దగా అరుస్తుంది.


ఆ అరుపు విన్న అడవి మనుషలు చాలా దూరం నుండే డబ్బు, దస్కం ఉన్న ప్రయాణీకులు అటు వైపుగా వస్తున్నారని గ్రహించి, ఆ మార్గంలో మాటువేసి ప్రయాణీకుల దగ్గరగా రాగానే వాళ్ళ దగ్గరున్న సంపదలు దొచుకొని వాళ్ళని చంపేస్తారు. ఇదీ వాళ్ళు తర, తరాలుగా చేస్తున్న పని.

చివరికి అనుకున్నంత అయింది. అనాగరిక అడవి మనుషులు వ్యాపారుల్ని, శర్మని బంధించారు. ఆ తెగ నాయకుడు నల్లగా, ఎత్తుగా, భయంకరంగా ఉన్నాడు.

అతడు వ్యాపారుల వద్దకు వచ్చి పెద్దగా గర్జించాడు. రేయ్, మర్యాదగా మీ దగ్గరున్న డబ్బు, నగలు ఇచ్చేసి ప్రాణాలు దక్కించుకోండి. ఆ ఆటవిక నాయకుడి బెదిరింపుకి వ్యాపారులు గడ, గడలాడిపోయారు. అప్పుడు శర్మ ఇలా అనుకున్నాడు.

ఈ దొంగల నాయకుడు వ్యాపారుల్ని చంపి అయినా సరే, వాళ్ళు పొట్టల్లో దాచుకున్న వజ్రాలు తీసుకొని తీరతాడు. తానూ ఎలాగూ, వాళ్ళ చేతిలో చావక తప్పదు. కనుక తానే ముందు వాళ్ళ చేతుల్లో ముందుగా మరణిస్తే, తన పొట్టలో వజ్రం లేదు కాబట్టి, మిగిలిన వాళ్ళ పొట్టల్లో కూడా ఏమీ ఉండవని భావించి వాళ్ళనైనా వదిలేస్తాడు. శర్మ అలోచనలు ఇలా ఉండగా, అటు ఆటవిక నాయకుడు పెద్దగా అరుస్తున్నాడు.

ఓరేయ్ నా రాబందు దగ్గర సంపదలేని వాళ్ళని చూసి అరవదురా, నిజం చెప్పండి. డబ్బు, నగాలు ఎక్కడ దాచారు అని. వ్యాపారులు ఏం



చెప్పాలో అర్థంకాక గుటకలు మ్రింగుతున్నారు. అప్పుడు శర్మ ఆటవిక నాయకుడి దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు.

“ఓరి నాయకా! మా వద్ద ఏ సొత్తు లేదని చెపితే నీవు నమ్మటం లేదు. అందర్నీ చంపి, పొట్టలు చీల్చి మరీ సంపద కోసం వెదుకు దామని చూస్తున్నావు. నీకంత అప నమ్మకంగా ఉంటే, ముందు నన్ను చంపి, నా పొట్టచీల్చి చూసుకో, నా పొట్టలో ఏమీ లభించని పక్షంలో మిగిలిన వారి పొట్టల్లో కూడా ఏమీ ఉండవని భావించి వాళ్ళని వదిలేయ్!

అప్పుడు ఆ తెగ నాయకుడు తన పెంపుడు రాబందు ఎప్పుడూ, అబద్ధం చెప్పదనీ, వాళ్ళ దగ్గర ఏదో ఒక సంపద ఉండి తీరుతుందని అన్నాడు. సరే నీ మాట కూడా ఎందుకు నిర్లక్ష్యం చెయ్యాటం. ముందు నిన్ను చంపి, నీ పొట్ట చీల్చి చూస్తాను–

పొట్టలో ఏమీ లేకుంటే, ఈ వ్యాపారుల పొట్టల్లో కూడా ఏమీ ఉండవని నిర్ణయించి, వాళ్ళని స్వేచ్ఛగా వదిలేస్తా అన్నాడు. ఆ తర్వాత శర్మ తల నరికి చంపారు. తర్వాత అతని పొట్ట చీల్చి చూడగా, అందులో ప్రేగులు, రక్తం తప్ప, ఏ డబ్బు బంగారం లేవు. దాంతో ఆ తెగ నాయకుడు

తన రాబందు పొరపాటు పడిందని విశ్వశించి, మిగిలిన నలుగురు వ్యాపారుల్ని బంధ విముక్తుల్ని చేసి, వెళ్ళి పొమ్మని చెప్పాడు.

దాంతో ఆ వ్యాపారులు బ్రతికించావు దేముడా అనుకొని, తమ నగరం వైపు దాదాపు పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయారు. శర్మ ఎంత నీచుడైనా, తన చావు ద్వారా మిగిలిన నల్గురికి ప్రాణదానం చేసాడు. తన ప్రాణాన్ని బలిదానం చేసి, తోటి మానవుల్ని కాపాడాడు.

నీతి : అన్ని దానాలలోకి తనని తానే ఇతరుల కోసం బలి పెట్టుకోవటమే గొప్పదానం అవుతుంది.

అసూయకు ఫలితం

మేడపాడు అనే గ్రామంలో పాపయ్య అనే రజకుడు ఉండేవాడు. అతడు ఊళ్ళోని ప్రజల ఇళ్ళలోని మురికి బట్టలు ఉతికి, సాపు చేసి అందించేవాడు. పాపయ్యకి ఒక గాడిద, ఒక కుక్క ఉండేది.

గాడిద ఉదయం పూట మురికి బట్టల మూటలు మోసుకొంటూ పాపయ్య వెంట ఊరి చివరున్న పంట కాలవ దాకా వెళ్ళేది. సాయంత్రం కాగానే ఉతికి, మడతలు పెట్టిన బట్టల మూటలు మోసుకుంటూ ఇంటికి వచ్చేది.


అయినా దానికి పాపయ్య తగినంత తిండి పెట్టేవాడు కాదు. పైగా అప్పుడప్పుడూ, బుద్ధిలేని గాడిదా! అని తిడుతూ, బెత్తంతో బాదేవాడు. ఇక కుక్క విషయానికి వస్తే, అది చేసే పనిల్లా ఆ ఇంటికి కాపలా కాయటం. రాత్రిళ్ళు ఇంటి చుట్టూ తిరుగుతూ దొంగలు రాకుండా చూడటం.

పాపయ్య కుక్కని ఎంతో ప్రేమగా చూసేవాడు. దానికి పాలు పోసేవాడు. ఆదివారం నాడు మాంసం కూరపెట్టేవాడు. కుక్కకి యజమాని ఇస్తున్న ఆహారం, గౌరవం చూసి గాడిదకు ఆగ్రహం కల్గేది.

ఏమిటీ నా ఖర్మ, చచ్చేచాకిరీ, చేసే నాకేమో సరిగ్గా తిండి పెట్టరు, పైగా తిట్లు, దెబ్బలు, కానీ ఊరికే అలా నిల్చుని ఎవరైనా వస్తే మొరిగే కుక్కకు అంత గౌరవం ఏమిటి అని తెగ విచారించేది. చివరికి గాడిదకి ఒక విషయం స్ఫురించింది.

అదేమంటే కుక్కకి అంత గౌరవం ప్రాముఖ్యత రావటానికి కారణం దాని ప్రవర్తనే. అదెలానంటే యజమాని కనబడగానే కుక్క తోక ఆడిస్తుంది. ఆపై ముందరి కాళ్ళు పైకెత్తి, యజమాని ఛాతిపై వేసి యజమానిని నవ్విస్తుంది. ఇలా ఆలోచించిన గాడిద తాను కూడా కుక్కలాగే చేసి యజమాని మెప్పును పొందాలని గట్టిగా నిర్ణయిం తీసుకొంది.

అంతే ఆ రోజు నుండి గాడిద ప్రవర్తన మారిపోయింది. యజమాని పాపయ్య కనిపించినప్పుడల్లా, తోక ఆడించటం మొదలు పెట్టింది. పాపయ్య ఇది గమనించినా, ఏమి పట్టంచుకోలేదు.



ఆ తర్వాత ఒక రోజు పాపయ్య స్నానం చేసి, వాకిట్లో అరుగు పై కూర్చుని ఉండగా, గాడిద పాపయ్యకు ఎదరుగా నుంచుని రెండు కాళ్ళు అతడి ఛాతీపై ఉంచి, వేగంగా తోకను ఊపసాగింది.

దాంతో పాపయ్యకు దడ పుట్టింది. దీని సిగతరగా ఈ గాడిదకి గానీ పిచ్చెక్కలేదు కదా అనుకున్నాడు. కానీ ఆ సారి గాడిదని ఏమీ అనకుండా వదిలేసాడు.

దాంతో గాడిదకు ధైర్యం పెరిగి పోయింది. ఒకసారి పాపయ్య గోచీ పెట్టుకుని, ముక్కాలి పీటపై కూర్చుని, భార్యతో ఒంటకి నలుగు పెట్టించుకుంటున్నాడు.

ఇంతలో ఎవరో వచ్చి పిలుస్తే, అతని భార్య వీధిలోకి వెళ్ళింది. ఇంతలో అటువచ్చిన గాడిద, ముక్కాలి పీటపై కూర్చుని ఉన్న పాపయ్యను చూసి తోక ఆడిస్తూ, అతని భుజాలపై తన ముందు కాళ్ళు పెట్టింది.

దాంతో హడాలిపోయిన పాపయ్య తన గాడిదకు పిచ్చి ఎక్కింది అని నిర్ధారించుకొని, దాన్ని తీసుకెళ్ళి దొడ్లో ఉన్న ఒక చెట్టుకి కట్టేసి, ఒక బడిత తీసుకొని దాన్ని చావబాది వదిలి పెట్టాడు. దాంతో గాడిదకు యజమాని మెప్పును పొందాలన్న ఆశ చచ్చిపోయింది.

యజమాని కొట్టిన దెబ్బలకు మూలుగుతూ గాడిద తనలో తాను ఇలా ఆలోచించుకోసాగింది. నేను చేసిన పనులు ఆ కుక్క చేస్తే ముద్దుగా చూసిన యజమాని తను చేస్తే, ముద్దు చెయ్యక పోగా, చావబాదాడు. ఇదేంటి ఇలా జరిగింది.

నాకు కుక్కకీ ఉన్న తేడా ఏమిటి? ఇలా ఆలోచిస్తూ దెబ్బల బాధకి పెద్దగా ఓండ్రి పెట్టింది. దాంతో పాపయ్య ఇంట్లోంచి బయటికి వచ్చి గాడిదను ఇంకొసారి కర్రతో చావబాదాడు.

ఎవరు చేయాల్సిన పని వాళ్ళు చేస్తేనే, వాళ్ళకి రావాల్సిన గుర్తింపు వస్తుంది. ప్రక్క వాడిని చూసి అసూయపడి తనవి కాని పనులు చేస్తే బాధే మిగులు తుంది.

పులిని చూసి అసూయపడి ఒక నక్క తన శరీరం అంతా వాతాలు పెట్టుకొని, పులి అంతదాన్ని అయ్యానని అనుకొన్నది. వాతలు మిగిలాయి. నక్క నక్కే అవుతుంది కానీ పులిలా ఏనాటికీ కాలేదు.

నీతి : అసూయపడిన వాళ్ళకి కష్టాలు తప్పవు.

స్నేహమేరా జీవితం


పూర్వం చంద్రగిరి అడవుల్లో ఒక జింకల కుటుంబం జీవిస్తూఉండేది. ఆ కుటుంబంలో ఉన్న ఒక పిల్ల జింక మహా తుంటరిది. అది అనేక రకాలుగా దాని తల్లి, దండ్రుల్ని ఆడించి, విసిగించేది. ఒక్కోసారి అర్ధరాత్రులు తన మందని వదిలి దూరంగా వెళ్ళి గడ్డి మేసేది.

ఒకసారి ఆ జింక పిల్ల అలాగే మంద నుండి విడిపోయి, దూరంగా తిరగ సాగింది. అలా తిరుగుతూ తిరుగుతూ ఆ జింక పిల్ల ఒక వేటగాడు పన్నిన వలలో చిక్కిపోయింది. ఆ వేటగాడు ఆ జింకను తీసుకెళ్ళి యువరాణికి జన్మదిన కానుకగా ఇచ్చాడు. ఆ అందమైన జింక పిల్లను

చూసిన యువరాణి ఆనందంతో ఎన్నో విలువైన ఆభరాణాలు, వస్త్రాలు వేటగాడికి బహుమతిగా ఇచ్చింది. అంత విలువైన బహుమానాలు అందుకున్నా వేటగాడు ఆనందంగా తన ఇంటికి తిరిగి వెళ్ళాడు.



యువరాణి ఆ జింకను ఎంతో ప్రేమగా చూసుకున్నది. దానికి ఎన్నో రకాల ఆహారాలు పెట్టేది. ఎన్ని చేసినా, ఆ జింకకు ఆనందం కలుగలేదు. కారణం స్వేచ్ఛ జీవిగా ఆనాటి దాకా బ్రతికిన జింక యువరాణి గృహంలో నిర్భంధించ బడింది. అలా దిగులు పడి, ఆ జింక పిల్ల నిద్ర ఆహారాలు మనేసి, దిగులుగా పడుకునేది. ఇది చూసిన యువ రాణి ఎంతో బాధ పడి జింకకు స్వేచ్ఛ కల్గించాలని నిశ్చయించుకొని, భటుల్ని పిలిచి ఆ జింకను అడవిలో వదిలి రమ్మని ఆజ్ఞాపించింది. దాంతో భటులు ఆ జింక పిల్లను తీసుకెళ్ళి అడవిలో వదిలేసారు. అంతే జింకకు మళ్ళీ బ్రతికినట్టుగా అనిపించి, తన తల్లిదండ్రులు ఉండే చోటికి పరిగెత్తింది.



పాపం దాని దురదృష్టం వలన దాని కుటుంబం ఎటో వెళ్ళిపోయింది. దాంతో జింక పిల్ల నిరాశగా ఆ అడవిలో మిగిలి పోయింది. ఆ తర్వాత ఆ జింక పిల్లకు మూడు ప్రాణులతో మంచి స్నేహం ఏర్పడింది. అవేంటో తెలుసా, ఒక తాబేలు, ఒక ఎలుక, ఒక కాకి. అలా జింక వాటితో స్నేహం

చేస్తూ, తల్లిదండ్రులు లేని బాధను మర్చిపోయి హాయిగా కాలం గడపసాగింది.

ఇలా నెలలు గడిచాయి. ఒకరోజు ఒక వేటగాడు ఆ ప్రాంతనికి వేట ఆడటానికి వచ్చాడు. వేటగాడిని చూడగానే జింక ఒక్కగెంతులో అడవి లోపలికి పారిపోయింది. కాకి రివ్వున గాలిలోకి ఎగిరింది. ఎలుక దగ్గరలో ఉన్న తన కలుగులో చటుక్కున దూరిపోయింది.

పాపం బండ తాబేలు నిదానంగా పాకుతూ దగ్గరలో ఉన్న పొదలోకి జారుకోవాలని ప్రయత్నంచేసింది. కానీ దాని దురదృష్టం కొద్దీ వేటగాడి చేతులకి చిక్కిపోయింది.

ఆ వేటగాడు చిక్కిందే చాలు, ఈ రోజు ఆహారం దొరికింది అనుకుంటూ తాబేలు కాళ్ళు నాలుగు తాడుతో కట్టేసి భుజాన వేసుకుని అడవిలోంచి తన గ్రామానికి నడవసాగాడు.

వేటగాడు వెళ్ళిన పది నిముషాలకి జింక, ఎలుక, కాకి సమావేశం అయి, తమ మిత్రుడు తాబేలు వేటగాడికి చిక్కిందే అని దుఃఖించారు. అప్పుడు ఎలుక ఇలా అన్నది.

చెయ్యాల్సిన పని చేయకుండా, విచారిస్తూ కూర్చొంటే మన మిత్రుడు ఎలా బ్రతుకుతాడు. కనుక మన ప్రయత్నం మనం చేద్దాం. ఆపై దేముడే అన్నీ చూసుకుంటాడు. ఎలుక మాటలు నిజమేననిపించాయి కాకి, జింకలకి.


దాంతో అవి ఎలాగైనా మన మిత్రుడిని ఆ వేటగాడి బారి నుండి రక్షించాలి, ఏదైనా పథకం చెప్పు అని ఎలుకని అడిగాయి. ఎలుక కసేపు ఆలోచించి ఇలా అన్నది.

ఈ వేటగాడు తన గ్రామం చేరాలంటే దొవలో ఒక వాగుని దాటాల్సి ఉంటుంది మనం ఆ వాగు దగ్గర కాపు వేసి, ఆ వేటగాడిని బురిడీ కొట్టించి, మన తాబేలు మిత్రుడిని రక్షించాలి.

ముగ్గురు మిత్రులు అడ్డదారిలో ప్రయాణించి ఆ వేటగాడి కన్నా ముందుగానే వాగు ఒడ్డుకు చేరుకున్నాయి. దూరంగా వస్తున్నా వేటగాడిని గమనించి ఎలుక, తన పథకాన్ని కాకి, జింకలకి వివరించింది. వేటగాడు

వాగు దగ్గరికి వచ్చేసరికి ఎలుక వేసిన వ్యూహం ప్రకారం జింక చచ్చిపోయిన దానిలా వాగు ఒడ్డున పడిపోయింది.

అలాగే కాకి కూడా పథకంలో భాగంగా చచ్చినట్లు నటిస్తున్న జింకను పొడిచి తింటున్నట్టుగా నటించసాగింది. చచ్చి పడుకున్న జింకను గమనించిన వేటగాడు చాలా సంతోషించి ఆ జింకను తీసుకొందామని తాబేలును క్రింద పెట్టి, జింకకేసి నడిచాడు. ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న ఎలుక, చటుక్కున వెళ్ళి తాబేలును కట్టిపడేసిన తాళ్ళను పట, పట కొరికి పారేసింది.



వేటగాడు సరిగ్గా తనకి 12 అడుగుల దూరంలోకి రాగానే చచ్చినట్టున్న జింక చివ్వున లేచి పరిగెత్తింది. కాకి కూడా గాలిలోకి ఎగిరింది. వేటగాడు జింక ఆడిన నాటకానికి ఆశ్చర్యపడి కనీసం తాబేలునైనా దక్కించుకొందామని వెనక్కి తిరిగి వెళ్ళిచూసే సరికి వాగులోకి దిగుతున్న తాబేలు కనిపించింది. దాంతో వేటగాడికి వెర్రివెక్కి పోయింది.

ఇంతలో కాకి వేగంగా ఎగిరి వేటగాడి కళ్ళను పొడిచింది. దాంతో వేటగాడు కళ్ళు పోయి భయంతో బెదిరిపోయి వేగంగా వాగు దాటి తన గ్రామంలోకి పరిగెత్తాడు. ఆ తర్వాత కాకి, తాబేలు, జింక, ఎలుక చాలా కాలం ఆ అడవిలో స్వేచ్ఛగా తిరుగుతూ, స్నేహంగా జీవించాయి. ఇక

కాకిచే గాయపడ్డ వేటగాడికి ఒక కన్ను పోయింది. దాంతో వేటాడటం మానేసి ఏవో పని, పాటలు చేసుకుంటూ జీవితం గడిపాడు.

నీతి : ఆపదలో ప్రాణాన్ని నిలిపేవాడే నిజమైన స్నేహితుడు.

దుష్టుడికి చేసిన మేలు

పూర్వం 'వేంద్ర' అనే గ్రామంలో పిచ్చయ్య శాస్త్రి అనే పేద బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడికి నలుగురు ఆడ పిల్లలు జన్మించారు. అతని భార్య సుశీల. చాలా ఓర్పు గల స్త్రీ. ఆమె ఎంత పేదరికం అనుభవిస్తున్నా భర్తను, పిల్లల్ని ఆపేక్షగా చూస్తుండేది. అధిక సంతానం పైగా సరిఅయిన సంపాదనా లేని శాస్త్రికి ఆర్థిక సమస్యలు అధికం కాసాగాయి.

శాస్త్రి కుటుంబం కనీసం ఒక్క పూటైనా కడుపు నిండా తిండి తినలేని దౌర్భాగ్య స్థితికి చేరింది. పైగా శాస్త్రి కూతుళ్ళలో మొదటి ఇద్దరు ఆడ పిల్లలు పెళ్ళీడుకు వచ్చేసారు. ఇక శాస్త్రి భార్య సుశీల ఈ దరిద్రాన్ని, అసహాయతను సహించలేకపోయింది.


దాంతో భర్తను, పిల్లలు దూరంగా దొడ్లొ చెట్టకు పాదులు తీస్తున్న సమయంలో కలిసి ఇలా అన్నది.

"ఏమండీ చూస్తున్నారు కదా, మన కుటుంబ దుస్థితి. తినటానికి తిండిలేదు. కట్టుకొవటానికి సరైన బట్టలులేవు. పైగా పైవాళ్ళు ఇద్దరూ పెళ్ళికి సిద్ధం అయ్యారు. మీరు వేరే ప్రాంతానికి వెళ్ళి, ఏదైనా ఉద్యోగం చేసి నాలుగు రూపాయలు సంపాదించుకురండి." భార్య మాటలకు శాస్త్రి 'ఔను' అన్నట్టు తల ఆడించాడు.

ఆపై ఏమీ ఆలోచించకుండా భార్య, బిడ్డల్ని గ్రామంలో వదిలేసి సంపాదన కోసం కాస్త దూరంలో ఉన్న పట్టణానికి బయలుదేరాడు. శాస్త్రి ఉంటున్న గ్రామం నుండి, పట్టణానికి చేరాలంటే మధ్యలో కొంత అడవి కుండా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అయినా సరే వెనకాడకుండా శాస్త్రి ప్రయాణం మొదలు పెట్టాడు. కొన్ని గంటలకు అడవి మధ్యదాకా వచ్చాడు.

అప్పటికి సమయం మిట్టమధ్యాన్నం కావస్తున్నది. శాస్త్రికి దాహం అధికంకాసాగింది. దాంతో ఎక్కడైన నీళ్ళు లభిస్తాయేమోనని, చుట్టు ప్రక్కల పరిశీలనగా చూసాడు. అక్కడకి కొన్ని గజాల దూరంలో ఏదో జలం ఉన్న ప్రదేశం కనిపించి అటు వైపు అడుగులు వేసాడు. తీరా చూస్తే అది ఒక బురద నేల. పైన కొద్దిగా నీళ్ళు కనిపిస్తున్నా రెండు అడుగులు ఆ బురదలో నడిస్తే అందులో మెడలదాకా కూరుకుపోవటం ఖాయం అని అర్థం అయి వెనక్కి తిరిగాడు.

సరిగ్గా అప్పుడే ఎవరో పిలిచినట్టు అనిపించి గిరుక్కున వెనక్కి తిరిగాడు. ఆ చిత్తడి నుండే ఆ పిలుపు వచ్చిందని గ్రహించి, జాగ్రత్తగా అటువైపు నడిచాడు. అప్పుడు పరిశీలనగా చూస్తే అతనికి కనిపించారు. ఆ చిత్తడి నేలలో తల వరకూ కూరుకుపోయిన ఒక మనిషి, ఒక పెద్ద పులి, ఒక పాము, ఒక కోతి చావటానికి సిద్ధంగా ఉన్న తమని కాపాడమని వారంతా శాస్త్రిని బ్రతిమిలాడారు.



శాస్త్రికి ఏంచేయాలో అర్థంకాలేదు. ఇంతలో పులి ఇలా అన్నది. ఓ బ్రాహ్మణోత్తమా! దయచేసి నన్ను ఈ ఊబి నుండి బయటికి లాగు, నీ మేలు మర్చిపోను. దానికి శాస్త్రి ఇలా అన్నాడు. ఓ పులీ! నీవు పూర్తిగా క్రూరమైన జీవివి. నిన్ను రక్షిస్తే, నీవు బైటపడి నన్నే తింటావు అన్నాడు భయంగా.

అప్పుడు పులి ఇలా అన్నది ఓయీ! అమాయకుడా, నాకు ప్రాణం దానం చేసే నీవు దైవంతో సమానం. నీకు హాని చేస్తానా అన్నది దీనంగా–

పులి మాటలకు జాలిపడిన శాస్త్రి ఆ ప్రాంతంలో దొరికిన చెట్టు ఊడను తెచ్చి, ఒక కొసను తను పట్టుకొని, రెండో కొసను పులి మీదకు విసిరాడు. దాంతో ఆ పులి జాగ్రత్తగా ఆ చెట్టు ఊడ కొసను పట్టుకొని ఒడ్డుకు చేరి శాస్త్రికి నమస్కారంచేసి ఇలా అన్నది. ఓ నాయనా! నా ప్రాణం కాపాడవు.

నీకు నాకృతజ్ఞతలు, నీకు వీలైనప్పుడు ఇక్కడికి మూడు క్రోసుల దూరంలో ఉన్న నా గుహకిరా, నీకు తగిన బహుమానం ఇస్తాను. ఇలా చెప్పి ఆ పులి వెళ్ళి పోయింది.

ఆ తర్వాత మనిషి తనను కూడా కాపాడమని శాస్త్రిని బ్రతిమిలాడసాగాడు. శాస్త్రి మనసు కరిగి పోయి, ఆ మనిషిని రక్షించాలని అనుకున్నాడు.

అప్పుడు ఆ ఊబిలో ఉన్న కోతి, పాము శాస్త్రితో ఇలా అన్నాయి. ఓ అమాయుకుడా! ఈ మనిషి పరమ నీచుడు. దుర్మార్గుడు. వీడిని గానీ రక్షించావంటే నీకు హాని జరుగుతుంది.

అయినా శాస్త్రి ఏమీ ఆలోచించకుండా ఆ ఊబిలో ఇరుక్కున్న మనిషిని మర్రి ఊడ సాయంతో బయటికి లాగాడు. ఆ మనిషి బయటికి వచ్చి శాస్త్రితో ఇలా అన్నాడు. ఓయీ ప్రాణాదాతా! నన్ను రక్షించిన నీ మేలు ఎన్నాడూ మర్చిపోను.

నీకేదైనా అవసరం వస్తే నన్ను కలుసకో, నేను దగ్గరలో ఉన్న 'చెల్లూరు' గ్రామంలో బంగారు వస్తువులు ఆభరణాలు చేసే కంసాలిని, అని చెప్పి కంసాలి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత శాస్త్రి కోతిని, పాముని రక్షించి, ఒడ్డుకు చేర్చి తన దొవన తను పట్టణానికి బయలుదేరాడు. శాస్త్రి పట్టణం చేరి చాలా మంది వైశ్యుల రాజుల ఇంట పూజలు జరిపించి చాలా ధనం దక్షిణాలుగా గడించాడు. అలా మూడు నెలలు గడిచాయి. శాస్త్రి సంతోష పడి ఇక భార్య, బిడ్డల దగ్గరకు వెళ్ళి పోవాలని నిర్ణయించుకొని ఒక శుభముహూర్తంలో తాను సంపాదించిన ధనాన్ని భద్రంగా ఒక మూటగా కట్టి, 'వేంద్ర' గ్రామానికి ప్రయాణం మొదలు పెట్టాడు.

మళ్ళీ అడవిలోకి వచ్చాడు. అప్పుడు శాస్త్రికి ఒక ఆలోచన వచ్చింది. తను ప్రాణదానం చేసిన వాళ్ళు తనకి మళ్ళీ ఉపకారం చేస్తామని వాగ్దానం చేసారు కదా! వాళ్ళని ఇప్పుడు కలిస్తే ఏమైన ఇస్తారేమో చూడాలి. దాంతో శాస్త్రి గబ,గబా నడుస్తూ పులి ఉన్న గుహలోకి వెళ్ళాడు. ఆ గుహలో ఉన్న పులి శాస్త్రిని చూసి, ఓయీ! బ్రాహ్మణుడా ఆనాడు నా ప్రాణం కాపాడవు. అందుకు ప్రతిఫలంగా నీకు ఈ ఆభరణాలు ఇస్తున్నాను తీసుకో అని కొన్ని హారాలు, ఉంగరాలు శాస్త్రికి ఇచ్చింది.

వాటిని చూసి శాస్త్రి చాలా ఆనందించాడు. అయినా అనుమానంగా అడిగాడు. ఓయీ! పులిరాజా! ఇంత ఖరీదైన నగలు నీకు ఎలా లభించాయి. అప్పుడు పులి ఇలా అన్నది.

ఒకసారి ఒక రాజ కుమారుడు ఈ అడవికి వేటకు వచ్చాడు. నేను అతడిని చంపి తినేసాను. ఆ తర్వాత అతడి ఆభరణాలు తీసుకొని భద్రపరిచాను. దాంతో శాస్త్రి గట్టిగా నిట్టూర్చి, ఆ ఆభరణాలు తన సంచీలో సర్దుకొని, పులి దగ్గర వీడ్కోలు తీసుకొని మళ్ళీ ప్రయాణం మొదలు పెట్టాడు.

కొంతదూరం నడిచాక ఒక కోతి ఎదురు పడింది. అది వేరే ఎవరోకాదు శాస్త్రి గతంలో రక్షించిన కోతే. ఆ మర్కాటం శాస్త్రిని గుర్తు పట్టి, ఆపేక్షగా పలకరించి, కాసిని పళ్ళు, కాయలు పెట్టింది. ఆకలి మీదున్న శాస్త్రి ఆ పళ్ళను సగం తిని, మిగిలినవి సంచీలో పెట్టుకొని కోతి దగ్గర వీడ్కోలు తీసుకొని బయలుదేరాడు.

అలా వెళ్తుండగా శాస్త్రికి ఒక ఆలోచన వచ్చింది. అదేమంటే పులి ఇచ్చిన నగల్ని, చెల్లూరులో తాను కాపాడిన కంసాలికి అమ్మి, మరి కొంత డబ్బు సంపాదించాలిని. ఆలోచన తట్టిన మరుక్షణం శాస్త్రి 'చెల్లూరు' గ్రామం వెళ్ళి, కంపాలిని కలిసాడు. శాస్త్రిచే కాపాడబడ్డ కంసాలి శాస్త్రిని గుర్తుపట్టి ఆహ్వానించి ఆదరంగా కూర్చోపెట్టి ఓయి విప్రుడా! ఏమిటి ఇలా వచ్చారు. నా వలన కావల్సిన పని ఏమైనా ఉన్నాదా అని వినమ్రంగా అడిగాడు.

అప్పుడు శాస్త్రి తన సంచీలో ఉన్న పులి ఇచ్చిన ఆభరణాలు కంపాలికి ఇచ్చి వాటికి తగిన ధర ఇమ్మని అడిగాడు. ఆ నగల్ని తీసుకొని కంసాలి పరిశీలించి అవి తాను యువరాజు కోసం చేసినవి అని గ్రహించి, పైకి మాత్రం ఏమీ అనకుండా శాస్త్రిని కూర్చోమని చెప్పి ఆ నగలు తీసుకొని దొడ్డి దొవకుండా ఇంట్లోంచి బయలుదేరి రాజుగారిని కలిసి ఆ నగలు ఇచ్చాడు.

రాజుగారు ఆ నగల్ని చూసి తన కుమారుడిని చంపి నగలను శాస్త్రి అపహరించి ఉంటాడని అపోహపడి, భటుల్ని పిలిచి, శాస్త్రిని బంధించి కారాగారంలో వేయమని ఆజ్ఞాపించాడు. కంసాలి దుర్మార్గ బుద్ధి వల్ల అమాయకుడైన శాస్త్రి జైలుపాలై దుఃఖించసాగాడు.

ఇలా కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు శాస్త్రికి గుర్తుకు వచ్చింది. ఆనాడు తనచే రక్షించబడ్డ పాము. అవసరం అయినప్పుడు సహాయం చేస్తానన్న మాట. దాంతో శాస్త్రి ఆ పామును మనస్సులో తల్చుకున్నాడు.



అంతే ఆ పాము శాస్త్రి ముందు ప్రత్యక్షమై ఇలా అన్నది. ఓయి అమాయక శాస్త్రి ఆనాడు నేను చెప్పినా వినకుండా ఆ దుష్ట మానవుడ్ని కాపాడావు. ఇప్పుడు కారాగారంలో పడి అలమటిస్తున్నావు.

అయినా గతం, గతః ఇప్పుడు నేను చెప్పినట్టు చెయ్యి, నీకు అంతా మంచే జరుగుతుంది. ఏం చెయ్యాలి అని ఆత్రుతగా అడిగాడు శాస్త్రి. చూడు... నేను ఈ దేశాన్ని పాలిస్తున్న రాజుగారి భార్యను కాటు వేస్తాను. నీవు వచ్చి ఆమెని తాకితే చాలు, నా విషం విరిగిపోయి ఆమె బ్రతుకుతుంది. తన భార్యను రక్షించినందుకు ఆ రాజుగారు నిన్ను ఈ జైలు నుండి విడిపిస్తాడు అన్నది పాము.

ఆ తర్వాత ఆ సర్పం రాణిగారి అంతఃపురాన్ని చేరి, నిద్రిస్తున్న రాణిగారిని కసుక్కున కాటేసి అక్కడ నుండి వెళ్ళిపోయింది. రాణిగారిని పాము కాటేసింది అన్న మాట విని, రాజుగారు హడవుడిగా అంతఃపురం చేరి, రాజ వైద్యుల్ని అందర్నీ రప్పించారు.

రాజు వైద్యులు ఎంత ప్రయత్నం చేసినా, ఎన్ని మందులు వాడినా రాణీ గారు లేవలేదు.

దాంతో రాజుగారు ఆందోళన చెంది రాణీగారిని కాపాడిన వారికి మంచి బహుమానం ఇస్తానని ప్రకటించాడు. ఎందరో వైద్యులు వైద్యం చేసారు. కానీ రాణీగారికి సృహరాలేదు. చివరిగా శాస్త్రికి అవకాశం ఇవ్వబడింది.

శాస్త్రి రాణిగారి తల్పం దగ్గరకు వెళ్ళి, ఏదో చదువుతున్నట్టుగా పెదవులు కదుపుతూ, రాణిగారి చెయ్యిని తాకాడు. అంతే పాము విషం విరిగిపోయి, రాణీగారు లేచి కూర్చున్నారు.

దాంతో రాజుగారు సంతోషించి శాస్త్రిని క్షమించేసారు. అప్పుడు శాస్త్రి జరిగినదంతా చెప్పి తన నిర్దోషిత్వాన్ని వివరించాడు.

రాజుగారికి అంతా అర్థమయింది. వెంటనే కృతజ్ఞుతుడు అయిన ఆ కంసాలి కారాగారంలో వేయించి, శాస్త్రికి మంచి బహుమతులు ఇవ్వటమే కాకుండా తన ఆస్థాన పురోహితుడిగా ఉద్యోగం కూడా ఇచ్చాడు.


ఆ తర్వాత శాస్త్రి భార్యా బిడ్డలతో రాజుగారి ఆస్థాన పురోహితుడిగా ఉంటూ, సకల భోగాలు అనుభవిస్తూ కాలం గడిపాడు.

నీతి : మంచి చెప్పే మిత్రుల మాట వినాలి.

తొందరపాటు తనం

పూర్వం నల్లూరు అనే గ్రామంలో రామశాస్త్రి అనే పేద బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు ఆ ఊరి దేవాలయంలో పూజారిగా పని చేస్తూ ఉండేవాడు. రామశాస్త్రి అప్పుడప్పుడు ఆ ఊరి ప్రజలు తమ ఇళ్ళల్లో చేసుకొనే వ్రతాలు, పూజలను జరిపించి వాళ్ళు ఇచ్చే కొద్దిపాటి సంభావనలు తీసుకుంటూ కాలం గడిపేవాడు.

రామశాస్త్రి భార్య సీతమ్మ ఆమె భర్త తెచ్చిన కొద్దిపాటి డబ్బుతోనే కుటుంబాన్ని గుట్టుగా నడుపుకుంటూ ఉండేది. అయితే రామశాస్త్రి దంపతులకు ఉన్న ఏకైక బాధ వాళ్ళకి పిల్లలు లేరు. వాళ్ళకి పెండ్లి అయ్యి 10 సం॥ములు గడిచినా సంతాన భాగ్యం కలగలేదు. దాంతో రామశాస్త్రి ఆయన భార్య ఎన్నో పూజలు, వ్రతాలు చేశారు. తీర్థయాత్రలు చేసి అనేక మంది దేవుళ్ళకి మ్రొక్కుకున్నారు. చివరికి వాళ్ళ పూజలు ఫలించి రామశాస్త్రి భార్య సీతమ్మ ఒక పండంటి మగ బిడ్డకు జన్మినిచ్చింది.




లేకలేక కలిగిన ఆ మగ బిడ్డకు ఏ లోపం కలగకుండా ఆ బిడ్డను పెంచసాగారు. రామశాస్త్రి ఇంట్లో ఒక ముంగిసని చాలా కాలంగా పెంచుకుంటున్నాడు. ముంగిస అంటే తెలుసు కదూ! అది ఉడత జాతికి చెందిన పెద్ద పరిమాణంలో ఉండే ప్రాణి. ముంగిసకు, పాముకి ఆజన్మ విరోధం ఉంది. ఎప్పుడైనా పాము, ముంగిస ఎదురెదురు పడి పోట్లాడుకుంటే ముంగిస తనతో పోరాడుతున్న పాముని కొరికి ముక్కలు చేసి చంపేస్తుంది. ఆ రోజుల్లో గ్రామాల్లో పాముల బెడద ఎక్కువగా ఉండేది. అందువల్ల రామశాస్త్రి పాముల నుండి రక్షణకు గాను ముంగిసను పెంచుతూ ఉండేవాడు.

రామశాస్త్రి కుమారుడికి సంవత్సరం వయస్సు వచ్చింది. రామశాస్త్రి ఇంట్లో పెరుగుచున్న ముంగిస ఆ పసి బిడ్డకు మంచి స్నేహితురాలయ్యింది. ఒక రోజు సీతమ్మ ఆ ఊర్లో ఒకరి ఇంట్లో జరుగుచున్న పేరంటానికి వెళ్ళింది. బిడ్డను రామశాస్త్రికి అప్పగించి ఆమె వెళ్ళింది.

రామశాస్త్రి బిడ్డను ఎత్తుకొని ఆడిస్తున్నాడు. ఇంతలో ఆ ఊరి పెదకామందుగారి పాలేరు రామశాస్త్రి ఇంటికి వచ్చి కామందు గారి ఇంట్లో పూజ జరిపించటానికి రమ్మని ఆహ్వానించాడు. రామశాస్త్రి ఆలోచనలో పడ్డాడు.

ఒకప్రక్క భార్య బిడ్డను తనకు అప్పగించి పేరంటానికి వెళ్ళింది. తను బిడ్డను చూసుకుంటున్నాడు. బిడ్డకోసం, పూజ చేయించటానికి కామందుగారి ఇంటికి వెళ్ళకపోతే ఆయనకు కోపం వస్తుంది. దాంతో రామశాస్త్రికి ఒక ఉపాయం తట్టింది.

పసి బిడ్డను ఉయ్యాలలో పడుకోబెట్టి ముంగిసను ఆ బిడ్డకు కాపలాగా ఉంచి పూజ చేయించటానికి వెళ్ళిపోయాడు. ఇంతలో ఒక పెద్ద త్రాచుపాము



పసిబిడ్డ ఉన్న ఉయ్యాల దగ్గరకు వచ్చింది. అది చూసిన ముంగిస ఆ పాము పైకి పోరాటానికిదిగింది. పాము, ముంగిస దారుణంగా పోరాడుకున్నాయి. చివరికి ముంగిస, పాముని ముక్కలు చేసి చంపేసింది. కాసేపటికి రామశాస్త్రి భార్య ఇంటికి తిరిగి వచ్చింది.

ఇంట్లో బిడ్డ ఉయ్యాల క్రింద రక్తము మడుగు కనిపించింది. అది చూసి ఆమె తాము పెంచుకుంటున్న ముంగిస తమకు లేకలేక కలిగిన

బిడ్డను కొరికి చంపేసిందని అపార్థం చేసుకున్నది. దాంతో సీతమ్మ పట్టలేనంత ఆగ్రహంతో ఆ ముంగిసను రోకలి బండతో కొట్టి చంపింది.

పాపం తన యజమాని కొడుకుని కాపాడుట కోసం త్రాచుపాముని చంపిన ఆ ముంగిస యజమాని భార్య చేతిలో ప్రాణాలు కోల్పోయింది. కాసేపటికి రామశాస్త్రి పూజచేయించి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చేసరికి ఏడుస్తూ కుర్చుని ఉన్న భార్య కనిపించింది. దాంతో కంగారు పడిని రామశాస్త్రి ఏం జరిగిందని భార్యని అడిగాడు. భార్య ఇలా చెప్పింది.

మన బిడ్డను కాపాడటానికి బిడ్డ ఉయ్యాల దగ్గరకు వచ్చిన త్రాచుపామును మన పెంపుడు ముంగిస చంపేసింది. నేను వచ్చి చూసేసరికి ఇల్లంతా రక్తం కనిపించి మన బిడ్డను ముంగిస చంపేసిందని అపార్థం చేసుకొని దానిని అన్యాయంగా కొట్టి చంపాను.

మన బిడ్డ ప్రాణం కాపాడిన ఈ ముంగిస ప్రాణం తీసి చాలా పాపం చేశాను. అని సీతమ్మ రోదించ సాగింది. రామశాస్త్రి ఇల్లంతా ఒకసారి పరిశీలించాడు. ఉయ్యాలలో బిడ్డ హాయిగా నిద్రపోతున్నాడు. ఉయ్యాల క్రింద ముంగిస చనిపోయి పడి ఉన్నది.

నీతి : ఏ విషయంలోను తొందరపాటు తనం పడకూడదు, బాగా ఆలోచించి ఏదైనా నిర్ణయించాలి.


అపరిచితుడిని నమ్మరాదు

పూర్వం చంద్రగిరి అడవులలో 'గజేంద్ర' అనే ఏనుగు ఉండేది. ఆ ఏనుగు చాలా పెద్దదిగా, మహాబలంగా ఉండేది. ఆ అడవిలో ఉండే అన్ని జంతువులు ఆ ఏనుగు ఆకారం, బలం చూసి హడలిపోయేవి. చివరికి క్రూరమృగాలైన పులి, సింహాలు కూడా గజేంద్ర దగ్గరకు కూడా వెళ్ళేవికాదు. ఇక ఆ గజరాజు దినచర్య పరమ అరాచకంగా ఉండేది.

ఉదయం సూర్యోదయం కాగానే నిద్రలేచి అలా అడవి మధ్యలో ఉన్న పెద్ద కొలనులో దిగేది. ఆ తర్వాత గంటల కొద్దీ ఆ కొలనులో స్నానం చేయటం, నీళ్ళతో ఆడుకోవటం చేసేది. దాని తొండాన్ని ఆ కొలనులో ముంచి 'బర్రున' చాలా నీళ్ళు పీల్చి, అన్ని వైపులకీ చిమ్మేది.

ఆ ఏనుగు అలా నీళ్ళు చిమ్మేసరికి ఆ కొలను చుట్టూ ఉన్న చెట్లపై ఉండే కోతులు, పక్షులపై నీళ్ళు ధారలు పడి ఊపిరి ఆడక గిల, గిలలాడి చెట్ల మీద నుంచి క్రింద పడి చచ్చేవి.

ఆ తర్వాత స్నానం అయినాక, నీళ్ళ నుండి బయటికి వచ్చి తనకు నచ్చిన పెద్ద పెద్ద చెట్లను తొండంతో పెకిలించి లేతగా ఉండే చెట్ల కొమ్మల్ని హాయిగా భోంచేసేది. ఇంకా అడవిలో ఉండే పళ్ళ చెట్లను కూడా తొండంతో విరగ దీసి, ఆ చెట్ల పండ్లను తింటూ ఉండేది.



ఆ ఏనుగు భారీ ఆకారం చూసి అది చేసే నిర్లక్ష్య చర్యల్ని అడ్డగించే సాహసానికి ఆ అడవిలో ఏ జంతువూ దిగలేదు. ఇక అడవికి రాజైన మృగరాజు సింహం కూడా ఏనుగు బలానికి భయపడి నోర్మూసుకొని కూర్చుంది. ఇలా ఆ ఏనుగు చేస్తున్న అరాచక చర్యలు ఆ అడవిలోని అన్ని జంతువులకి ప్రాణా సంకటంగా మారింది.

ఒకరోజు కొన్ని నక్కలు సమావేశం అయి, ఏనుగు చేస్తున్న చర్యలకు తిట్టుకున్నాయి. ఈ ఏనుగు ధాటికి మనం స్వేచ్ఛగా అడవిలో తిరగలేకపోతున్నాం. అని అక్రోసం వెళ్ళకక్కాయి.

అప్పుడు 'జంబులింగం' అనే కుర్ర నక్క లేచి, నక్క సోదరులారా! మీరు అందరూ అంగీకరిస్తే ఆ ఏనుగుని నేను సంహరిస్తాను. అలా చేస్తే ఆ ఏనుగు పీడా మనకి వదులుతుంది. పైగా అంత ఆకారంలో ఉన్న ఆ

ఏనుగు శరీరాన్ని మనం రెండు నెలలు హాయిగా భుజించవచ్చు అని ఉత్సాహంగా చెప్పింది.

జంబులింగం మాటలు విని, మిగిలిన నక్కలు ఉలిక్కిపడ్డాయి. అందులో ఒక నక్క ఇలా అన్నది. ఏనుగు ఛస్తే మనకే కాదు, ఈ అడవిలోని అన్ని జంతువులకీ పండుగే కానీ, ఏనుగు కాలు అంత కూడాలేని ఈ కుర్ర నక్క అంత పెద్ద ఏనుగుని ఎలా చంపుతుంది? దానికి జంబులింగం ఇలా అన్నది.

“మీరు అన్నది నిజమే, నేను ఏనుగు కన్నా చాలా, చాలా చిన్న పరిమాణంలో ఉన్నదాన్నే, కానీ నాకు తెలివి చాలా ఉన్నది. యుక్తిగా ఆ ఏనుగుని వంచించి సంహరిస్తాను.

దాంతో అన్ని నక్కలు ఆనందించి, జంబులింగాన్ని ఏనుగుని చంపే పథకం వేయమని కోరాయి. జంబులింగం ఉత్సాహంగా అక్కడి నుండి బయలుదేరి గజేంద్ర వద్దకు వెళ్ళాడు.

జంబులింగం వెళ్ళేసరికి, గజేంద్రుడు ఒక పెద్ద అరటి గెలను భోంచేస్తున్నాడు. నక్క అతి వినయంగా వంగి, గజేంద్రకి నమస్కారం పెట్టి నిల్చుంది.

గజేంద్రుడు అరటి గెల తినటం ఆపి, ఏయ్ నక్కా ఏంటి ఇలా వచ్చావు అంది గంభీరంగా... దానికి జంబులింగం ఓ గజేంద్రా! మీరు చాలా బలవంతులు.

మీకున్నబలం ఈ అడవిలో ఎవరికీ లేదు. అన్నది మహా వినయం ఒలక బోస్తూ, దానికి గజేంద్రుడు పొంగిపోతూ, అయితే ఏమంటావు అన్నాడు గర్వంగా అప్పుడు జంబులింగం ఇలా అన్నది.

“ఓ! గజరాజా, మీరు ఈ అడవికి రాజు అయి పాలించాలని ఈ అడవిలోని జంతువులు కొరుతున్నాయి. నేను ఆ జంతువుల ప్రతినిధిగా వచ్చాను. మీరు దయచేసి,ఈ అడవికి రాజుగా ఉండటానికి అంగీకరించాలి.”


ఏనుగు ఉత్సాహంగా సరే, ఇప్పుడు ఏంచేద్దామంటావు అన్నది. అప్పుడు జంబులింగం ఇలా అన్నది. ఓ గజేంద్ర ఈ రోజు సాయంత్రం

మీరు సింహాసనం ఎక్కాలి, ఒక పండితులవారు మంచి ముహూర్తం నిర్ణయించారు. మీకు ఈ రోజు పట్టాభిషేకం చేస్తాం.

దానితో గజేంద్రకి చాలా సంతోషం కలిగి, సరే పద, అన్నది. నక్క ముందు దొవ చూపిస్తుండగా, గజేంద్ర ఠీవిగా నడుస్తూ నక్క వెనకాల నడవసాగింది.

కొంత దూరం అలా అడవిలోకి వెళ్ళిన తర్వాత ఒక బురద నేల ఎదురయింది. నక్క బరువు తక్కువగా ఉండే జంతువు కనుక అలా చలాకీగా ఆ చిత్తడి నేలను దాటి వెళ్ళింది. ఏనుగు చిత్తడి నేల విషయం పట్టించుకోకుండా బలంగా అడుగులు వేస్తూ, చిత్తడి నేలలో కూరుకుపోసాగింది.

నిముషాలలో గజేంద్ర తల తప్పించి, మిగిలిన శరీరం అంతా ఊబిలాగా ఉన్న ఆ చిత్తడి నేలలో కూరుకుపోయింది. నక్క మాత్రం



కూలాసాగా, దూరంగా నించుని కూని రాగాలు తీయసాగింది. గజేంద్రకి జీవితంలో తొలిసారి భయం మొదలైంది. అది ప్రాణభయంతో గజ, గజలాడుతూ ఇలా అన్నది.

“ఓ నక్కా! నేను ఈ బురద నేలలోంచి బయటికి రాలేకపోతున్నాను. దయచేసి నన్ను బయటి లాగి కాపాడు. గజేంద్ర మాటలు విని జంబులింగం బిగ్గరగా ఊళ పెట్టి ఇలా అన్నది.

ఓరీ... బుద్ధిలేని బండ ఏనుగా, ముక్కు, మొహం తెలీయని అపరిచితుడిని అయిన నన్ను గుడ్డిగా నమ్మి వచ్చావు. నీ ఖర్మ కాలింది. నీవు ఈ బురదలో చావక తప్పదు.

దాంతో గజేంద్రుడు బిక్క చచ్చిపోయింది. ఆ తర్వాత కొన్ని నిముషాలకి ఆ ఏనుగు పూర్తిగా ఆ చిత్తడి నేలలో కూరుకుపోయి మరణించింది. ఏనుగు పీడా వదిలినందుకు ఆ అడవిలోని జంతువులన్నీ ఆనందించాయి.


నీతి : అపరిచితుల్ని నమ్మరాదు.

కాకి తెలివి

ఒకానొక గ్రామంలో ఒక శివాలయం ఉన్నది. ఆ శివాలయంలో ఒక పెద్ద వేప చెట్టు, ఆ చెట్టు చుట్టూ ఒక పెద్ద పాము పుట్ట ఉన్నది.

ఆ ఊళ్ళో జనాలు నాగులచవితినాడు ఆ పాము పుట్టలో పాలు పోసి పూజలు చేస్తుండేవాళ్ళు. అందులో ఒక దుష్టబుద్ధి గల పాము ఉండేది. అదే చెట్టుపైన చిటారు కొమ్మల్లో ఒక కాకి జంట గూడుకట్టుకొని కాపురం చేస్తుండేది.

కొన్నాళ్ళు గడిచాయి. ఆడ కాకి నాలుగు గుడ్లు పెట్టింది. మగ కాకి బయటికి వెళ్ళి ఆహారం తెచ్చి ఆడ కాకికి ఇస్తుండేది. ఆడ కాకి



గూడు వదిలి బయటికి వెళ్ళకుండా తాను పెట్టిన గుడ్లపై కూర్చుని పొదుగుతూ ఉండేది. ఒక నెల రోజులకి కాకి గుడ్ల నుంచి చిన్న, చిన్న కాకి పిల్లలు బయటికి వచ్చాయి. నల్లగా, ముద్దుగా ఉన్న తమ పిల్లల్ని చూసి తెగ సంతోష పడ్డాయి ఆ కాకులు. మరి కాకి పిల్ల కాకికి ముద్దు అంటే అదే కదా!

ఒకరోజు ఆకాకుల జంట, పిల్లల్ని గూడులో వదిలేసి ఆహారం కోసం ఊళ్ళోకి వెళ్ళాయి. ఆ సమయం కొసమే వేచి ఉన్న క్రింద పుట్టలోని విష సర్పం చర,చారా పాకి చెట్టు మీదకు వెళ్ళింది. కాకి పిల్లలు హాయిగా గూడులో నిద్రపోతున్నాయి. వాటిని చూసిన పాము మెల్లగా పడగను ఆ కాకి గూడులో ఉంచి, ఆ గూడులో ఉన్న కాకి పిల్లల్ని గుటుక్కున మింగి, మెల్లిగా చెట్టు దిగి పుట్టలోకి పోయి పడుకుంది.

మధ్యాహ్నానికి కాకుల జంట ఏదో ఆహారం ముక్కున కరుచుకొని గూడు దగ్గరకు వచ్చి చూస్తే, వాటి పిల్లలు లేవు. అక్కడ్కడ రెండు, మూడు కాకి పిల్లల రెక్కలు పడి ఉన్నాయి. తమ పిల్లల్ని చెట్టు క్రింద పుట్టలో ఉన్న సర్పం తినేసిందని వాటికి అర్థం అయి భోరున విలపించాయి. పాపం, ఆ బలహీన పక్షులు తమ బిడ్డల్ని మింగేసిన విషసర్పాన్ని ఏంచేయగలవు.


దిక్కులేని వాడికి దేముడే దిక్కుఅని గుండె దిటవు చేసుకొని మామూలుగా జీవించసాగాయి. కొన్నాళ్ళకి మళ్ళీ ఆడకాకి గుడ్లు పెట్టింది. మళ్ళీ పిల్లలు పుడతాయన్న ఆనందం కన్నా, పాము మళ్ళీ తమ బిడ్డల్ని చంపుతుందన్న భయమే ఆ కాకి జంటకు అధికం అయింది. సరే దేముడి మీద భారం వేసి కాలం గడుపుతున్నాయి. ఆ జంట కాకులు.

కొన్నాళ్ళకి ఆ గుడ్ల నుండి చిన్న, చిన్న కాకి పిల్లలు బయటికి వచ్చాయి. ఈసారి చాలా జాగ్రత్తగా వంతులు వారిగా తమ పిల్లలకు కాపలా కాయసాగాయి కాకి దంపతులు.

ఒకసారి గత్యంతరంలేక రెండు కాకులు పిల్లల్ని గూడులో వదిలి బయటికి వెళ్ళాయి. సరిగ్గా అది కనిపెట్టిన చెట్టు క్రింద పుట్టలోని దుష్ట సర్పం గబ,గబా చెట్టుపైకి పాకి కాకి పిల్లల్ని గుటుక్కున మింగి, చెట్టు దిగి వచ్చేసింది.

గూడుకి తిరిగి వచ్చి చూసిన కాకులకు పిల్లలు కనిపించలేదు. దాంతో ఆ కాకుల జంట పిల్లల కోసం రోదించాయి. అయితే ఏడవటం వలన ప్రయోజనం ఏముంది అని మగ కాకి గ్రహించి, తమ బిడ్డల్ని చంపివేస్తున్న సర్పాన్ని ఎలా శిక్షించాలని నిర్ణయించుకొన్నది.





వెంటనే మగకాకి దగ్గరలో ఉన్న అడవిలో ఉన్న ఒక నక్క మిత్రుడి వద్దకు సలహాకోసం వెళ్ళింది. మగకాకి చెప్పినదంతా విని నక్క ఇలా అన్నది.

“మిత్రమా! బలవంతుడైన శత్రువుని యుక్తిగా మట్టు పెట్టాలి. మన శత్రువుని సంహరించే బలం మనకి లేనప్పుడు అతని కంటే బలమైన వాడిని, వాడిపైకి పురికొల్పి వాడిచే మన శత్రువును చంపించాలి. ఇదే నిజమైన మేధస్సు.

దానికి కాకి సంతోషించి, మిత్రమా! నీవన్నది నిజమే, అయితే సర్పాని కన్నా బలమైనవాడు ఎవడు? ఎక్కడుంటాడు? వాడిని ఎలా సర్పంపైకి రెచ్చగొట్టాలి? అంటూ ఆత్రుతగా ప్రశ్నించింది.

అప్పుడు నక్క ఇలా అన్నది. కాకి మిత్రమా! శాంతంగా విను. ఇక్కడికి దగ్గరలో ఒక రాజ్యం ఉన్నది. ఆ రాజ్యానికి చెందిన ఒక యువరాణి, ప్రతిరోజు తన తోటలోని చెరువులో జలకాలాటలాడుతుంది. ఆ సమయంలో ఎవ్వరూ అక్కడికి రాకుండా ఆ తోట చుట్టూ గట్టి కాపలా ఉంటుంది. నీవు ఆ యువరాణి నగలో ఒక దానిని తెచ్చి, నీకు హాని చేస్తున్న పుట్టలో వెయ్యి.

ఆ హారాన్ని నీవు అపహరించి తీసుకెళ్ళి పుట్టలో వేయటం చూసి యువరాణి తాలుక సైనికులు ఆ హారం కోసం పుట్టత్రవ్వుతారు. అప్పుడు కనబడే సర్పాన్ని చంపుతారు. ఆ విధంగా నీకు పాము పీడ విరగడ అవుతుంది. ఆ పథకాన్ని విన్న మగ కాకి మిక్కిలి ఆనందించి, తన పగ తీరే రోజు కోసం ఎదురుచూడసాగింది.


ఒకరోజు మధ్యాన్నం ఎడవేడిమి తాళలేక యువరాణి తన తోటలోని చెరులో స్నానం చేద్దామని వెళ్ళింది. అక్కడ ఒకచోట తన దుస్తులు, ఆభరణాలు ఉంచి, చెరువులోకి దిగింది. సరిగ్గా అదే సమయానికి అదను కోసం వేచి చూస్తున్న మగ కాకి, గభాల్న ఒక ఖరీదైన హారాన్ని ముక్కున కరచుకొని ఎగిరి పోసాగింది.

అది గమనించిన యువరాణి పెద్దగా అరిచింది. దాంతో ఒడ్డున కూర్చున్న చెలికత్తెలు సైనికుల్ని పిలిచి, జరిగింది చెప్పి, కాకి దగ్గర నుండి హారాన్ని తెమ్మని చెప్పారు.

ఆకాశంలో ఒక వంద అడుగుల ఎత్తున కాకి, హారాన్ని ముక్కుతో పట్టుకొని ఎగురుచున్నది. క్రింద భూమి పైన సైనికులు పరిగెడుతూ పైన

ఎగురుచున్న కాకిని అదిలిస్తున్నారు. హారం క్రింద పడవేయమని. కాకి అలా ఎగురుతూ ఊర్లో ఉన్న దేవాలయం దగ్గరున్న వేపచెట్టు దాకా వచ్చి, ఆ చెట్టు క్రింద ఉన్న పుట్టలోకి తన ముక్కున ఉన్న హారాన్ని లాఘవంగా జార విడిచింది.

కాకినే అనుసరించి వస్తున్న సైనికులు కాకి హారాన్ని పుట్టలో వదులటం చూసి గునపాలు తెచ్చి పుట్టను త్రవ్వ సాగారు. పైన పుట్టను త్రవ్వుతున్న శబ్దం విని పుట్టలో నిద్రిస్తున్న విష సర్పం బైటికి వచ్చి పుట్ట త్రవ్వుతున్న ఒక సైనికుడి కాలిని కాటువేయబోయింది. అంతే అది



గమనించిన ఇంకో సైనికుడు తన చేతిలోని గునపంతో ఆ పాము తలపై ఒక దెబ్బ వేసాడు. ఆ పాము తలవాల్చేసింది. ఆ తర్వాత సైనికులు చచ్చిన పాముని దూరంగా పారేసి, పుట్టలోని హారాన్ని జాగ్రత్తగా బయటికి తీసి యువరాణికి అందించారు.

ఆనాటి నుండి కాకి దంపతులు పాము పీడ విరగడై ప్రశాంతంగా గడుపసాగాయి. అన్నట్టు ఇప్పుడు ఆ కాకి జంటకు నాలుగు చిన్న కాకి పిల్లలు ఉన్నాయి. వాటిని గారాబం చేస్తూ ఆ కాకుల జంట కాలాన్ని మర్చిపోయాయి.

నీతి : కొండంత బలం కన్నా, గులకరాయంత మేధస్సు ఘనకార్యాలు సాధిస్తుంది.

గాడిద గుట్టు రట్టు అయింది

పూర్వం ముత్తు పల్లి అనే గ్రామంలో శీనయ్య అనే రజకుడు ఉండేవాడు. రజకుడు అంటే చాకలి అని అర్థం. ఊళ్ళో అందరి బట్టలు

ఊరి చివర ఉండే పంటకాలువ ఒడ్డున ఉతికి, కాలువ గట్టున ఆరేసేవాడు ఆ శీనయ్య. ఉదయం గంజితాగి, తన గాడిద మీద మురికి గుడ్డల మూటలు పెట్టి, గాడిదను తొలుకుంటూ కాలువ గట్టుకి వెళ్ళటం, ఆ తర్వాత ఆ మురికి గుడ్డల్ని సున్నం, సబ్బు ఉపయోగించి కాలువలో శుభ్రంగా ఉతికి ఆరేసి, సాయంత్రం కాగానే ఆ బట్టలు చక్కగా మడతలు పెట్టి, మూట కట్టి మళ్ళీ గాడిదపై వేసి ఊళ్ళోకి వెళ్ళి ఉదయం బట్టలు వేసిన వాళ్ళకి ఉతికిన బట్టలు ఇచ్చి, మెల్లగా ఇంటికి చేరేవాడు.

అయితే ఈ శీనయ్య పరమ పీనాశివాడు. తాను బాగా మూడు పుటలా తినేవాడు. పాపం బండచాకిరి చేసే అతని గాడిదకు సరిగా గడ్డి వేసేవాడు కాదు. ఇలా పాపం గాడిద చాలీచాలని ఆహారంతో గాడిద చాకిరీ చేస్తూ కాలం వెళ్ళదీస్తుంది.

ఒకరోజు శీనయ్య దగ్గరలో ఉన్న నగరం అనే పట్టణంలో సంత జరుగుతుండటంతో సరుకులు కొందామని గాడిదను తీసుకొని బయలుదేరాడు.

చాకలి శీనయ్యతో పాటు మంగలి జగ్గయ్య, గ్రామ పురోహితుడు శర్మ, ఇతర వ్యాపారులు సంతకి బయలు దేరారు. సంత అంటే ఏమిటో తెలుసా?

పూర్వకాలంలో ఇప్పటిలాగా కిరాణా దుకాణాలు, షాపింగ్ హాల్స్ లేవు కదా, అందుచేత ఎక్కడైనా ఒక పట్టణంలో చిన్న, చిన్న కొట్లు, మార్కెట్లు వారానికి ఒకసారి పెట్టేవారు. వాటినే సంతలు అంటారు. ఈ సంత జరిగిన రోజున చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు సంత జరిగే ప్రాంతానికి వెళ్ళి తమకు కావాల్సిన సరుకులు కొనుగొలు చేస్తూ ఉండేవారు.

ఇదిగో ఆ రోజునా ఇలాంటి సంతే నగరంలో జరుగుతుందన్నమాట. ఇక ముత్తు పల్లికి నగరానికి మధ్య దూరం పదిమైళ్ళు. పైగా ఈ పదిమైళ్ళు అడవి కుండా వెళ్ళాలి.

ఆ రోజుల్లో బస్సులు, రైళ్ళు లేవు. కనీసం సైకిళ్ళు కూడా లేవు. కనుక ఆనాటి ప్రజలు ఎడ్లు, గుర్రాలు కట్టిన బళ్ళలో వెళ్ళేవారు. సామాన్యులు కాలినడకన ఇంకొ చోట నుండి వెళ్ళేవారు.

సరే శీనయ్య అతని బృందం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఒక గంటలో నగరానికి నడిచి చేరుకున్నారు. సంత మంచి కోలాహలంగా ఉన్నది. శీనయ్య కూడా కావాల్సినవి కొనుక్కొని మళ్ళీ బయలుదేరాడు. అప్పటికి సాయంత్రం ఆరు అయింది. అది చలికాలం, పైగా పౌర్ణమి రోజులు కావటాన ఒక్కడే అయినా ధైర్యంగా తన గ్రామానికి బయలుదేరాడు శీనయ్య.

ఉదయం అతనితో బాటు వచ్చిన వాళ్ళు, ఏదో పని ఉండి, ఆ రాత్రికి నగరంలోనే ఉండిపోయారు. మరి శీనయ్య కూడా ఉండిపోతే రేపు ప్రొద్దున ఊళ్ళో జనాల మురికి బట్టలు ఎవరు ఉతుకుతారు. కనుక శీనయ్య ఏమీ సంకోచించకుండా సంతలో కొన్న సరుకులు గాడిదపై వేసి, ఏదో పాట పెద్దగా పాడుకుంటూ ముత్తు పల్లి వైపు నడక సాగించాడు.

సరిగ్గా అడవి మధ్యలోకి వచ్చే సరికి ఎక్కడినుండో పులి గాండ్రింపు వినబడింది. ఆ గర్జన విన్న శీనయ్యకు కాళ్ళు చేతులు బిగుసుకు పోయాయి. భయంతో అతని గాడిద కూడా గుడ్లు మిటకరించి శీనయ్య వెనకాల దాక్కుంది.



కాసేపటికి పులి అరుపు ఇక వినబడలేదు. దాంతో శీనయ్య బిక్కచచ్చి నిల్చున్న గాడిదను తట్టి, మళ్ళీ నడక ప్రారంభించాడు. కొంత దూరం పోయాక ఒక చెట్టు క్రింద ఒక పులి చర్మం పడి ఉన్నది. శీనయ్య ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి, ఆ చర్మాన్ని తీసుకొని గాడిదపై వేసి మళ్ళీ నడక ప్రారంభించాడు. రాత్రి 9 గంటలకి శీనయ్య, అతని గాడిద ఇల్లు చేరారు. శీనయ్య భార్య ఇంట్లోంచి బయటికి వచ్చి గాడిద మీదున్న సామానులు తీస్తూ, వాటిలో ఉన్న పులి చర్మాన్ని చూసి భయంతో కెవ్వున అరిచింది.

దాంతో శీనయ్య కంగారు పండి, భార్య దగ్గరికి వచ్చి ఒసేయ్, అరిచి చావకు అది పెద్ద పులికాదు. దాని చర్మం అన్నాడు పెద్దగా నవ్వుతూ,

దానికి అతని భార్య ఇలా అన్నది. ఛీ, ఆ చచ్చిన పులి చర్మం మనకెందుకు ఆవతల పారేయకుండా, దానికి శీనయ్య ఇలా అన్నాడు. ఏమేయ్ ఆ పులితొలే మన గాడిదకి కావాల్సినంత గడ్డి, గాదం దొరికేలా చేస్తుంది.


అదెలా అన్నది ఆశ్చర్యంగా శీనయ్య భార్య. అదెలాగొ చూద్దుగానివి అని, గాడిద దగ్గరగా వెళ్ళి దానికి తన దగ్గరున్న పులి చర్మాన్ని నేర్పుగా కప్పాడు. ఇప్పుడు కాస్త దూరం నుంచి చూస్తే, శీనయ్య గాడిద పులిలా కనిపిస్తుంది.

శీనయ్య గాడిద చెలిలో ఇలా అన్నాడు. ఈ రోజు రాత్రి నుంచీ, ప్రతిరాత్రి ఈ ఊళ్ళొ రైతుల పొలాల మీద పడి నీ ఇష్టం వచ్చినట్టు మెక్కి పారేయ్.

గాడిద ఆనందంగా ఊళ్ళొ రైతుల పొలాలలోకి వేగంగా వెళ్ళి, వరి పైరు కస, కస నమలటం ప్రారంభించింది.

అదే సమయానికి ఆ పొలానికి కాపాలాగా ఉందామని వచ్చిన ఇద్దరు రైతులు పులి చర్మంలో ఉన్న గాడిదను చూసి, పులి అని భ్రమించి పెద్దగా అరిచి గడ, గడలాడుతూ ఊళ్ళొకి పారిపోయారు. క్షణాల్లో ఈ వార్త ఊరంతా గుప్పుమన్నంది. ఏమిటావార్త మన గ్రామ పొలాలలో రాత్రిళ్ళు పులి తిరుగుతుందని. అంతే రాత్రిళ్ళు రైతులు పొలాలకేసి రావటం మానేశారు.

శీనయ్య గాడిద పంట పండింది. రోజు రాత్రి పూట, ఆ ఊరి చేలల్లో కావాల్సినంత గడ్డి, గాదం కడుపార తిని తెల్లారి గట్ల ఇల్లు చేరేది. ఇలా రోజులు గడుస్తున్నాయి. తేరగా దొరికే గడ్డీ, గాదం తిని శీనయ్య గాడిద యమాబలిసి పోయింది. నిజం నిప్పులాంటిది. అది ఎల్లకాలం దాగదు.



ఒకరోజు శీనయ్య గాడిద చేలో మేస్తుండగా, ఎక్కడి నుండో ఒక ఆడ గాడిద ఓండ్ర పెట్టసాగింది. ఆ ఓండ్ర విన్న శీనయ్య గాడిద కూడా కులాసాగా ఓండ్ర పెట్టింది. దూరంగా నక్కి చూస్తున్న ఒక రైతు ఇది కనిపెట్టాడు.


ఇన్నాళ్ళు తమని మోసం చేసి తమ పొలాల లోని పంట మేస్తున్నాది, పులి చర్మం కప్పుకున్న ఒక గాడిద అని తెలిసి, అందర్నీ కేకేసి పిలిచాడు. అందరూ దుడ్డ కర్రలు తీసుకొని శీనయ్య గాడిదని చావ బాదారు. ఆ దెబ్బలు తట్టుకొలేక ఆ గాడిద దగ్గరలో ఉన్న అడవులలోకి పారిపోయింది. ఆ తర్వాత శీనయ్య గాడిద మళ్ళీ ఊళ్ళోకి రాలేదు.

నీతి : పై అవతారం చూసి మోసపోరాదు.

దుష్టులతో స్నేహం

పూర్వం చంద్రగిరి అడవులలో సంజీవి అనే సింహం ఉండేది. ఆ సింహం పేరుకి క్రూర మృగం అయినా చాలా మంచి గుణాలు కలిగి మంచి పేరు కలిగి ఉండేది. ఒక రకంగా ఆ అడవికి,ఆ సింహం రాజుగానే భావించవచ్చు. ఆ సింహానికి ఒక కాకి, ఒక నక్క, ఒక తొడేలు మంచి స్నేహితులుగా ఉండేవి.

రోజూ సాయంకాలం సింహం తన స్నేహితులతో కలిసి అడవిలో షికారు చేస్తూ, బాగా ఆకలైనప్పుడు మాత్రమే ఏదైనా జంతువును వేటాడేది. అలా సింహం చేత చంపబడ్డ జీవాన్ని కాకి, నక్క, తొడేలులతో కలిసి సింహం భుజించేది.



ఒకరోజు సాయంకాలం సింహం దాని మిత్రులు అడవిలో సంచరిస్తుండగా, వాళ్ళకి ఒంటరిగా తిరుగుతున్న ఒక ఒంటె కన్పించింది. అది చూసిన సింహం, నక్కను పిల్చి ఇలా అన్నది. ఓయీ నక్క మిత్రమా!

అక్కడ ఓ ఒంటె ఒంటరిగా తిరుగుచున్నది. అది బహుశా ఎవరిదో వ్యాపారికి చెందిన ఒంటె కావచ్చు. దొవ తప్పి ఇక్కడ తిరుగుతున్నట్టుగా ఉన్నది. నీవు వెళ్ళి దాన్ని నా వద్దకు పిల్చుకు రా! దాంతో ఆ నక్క ఒంటె దగ్గరికి వెళ్ళి సింహం రాజుగారు రమ్మంటున్నారని చెప్పింది.

అప్పుడు ఒంటె సింహం దగ్గరికి వచ్చి నమస్కరించి నిల్చున్నది. అప్పుడు సింహం ఒంటెను కూడా తన మిత్రబృందంలో చేరమని ఆహ్వానించింది.

ఆ అడవిలో దిక్కు, దివానం లేకుండా తిరుగుతున్న తనకి సింహం ఆశ్రయం దొరకటంతో ఒంటె సంతోషంగా సింహం రాజుగారి స్నేహ బృందంలో చేరింది. ఆ తర్వాత సింహం, నక్క, తొడేలు, కాకి, ఒంటె రోజు హాయిగా వన విహారం చేస్తూ, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ ఉండేవి.

ఒకసారి ఆ అడవికి ఒక యువరాజు వేటకి వచ్చాడు. అతడు అనేక జంతువుల్ని వేటాడి, చివరగా సింహం పై ఒక బాణం వేసాడు. ఆ బాణం సింహం నడుం భాగంలో దిగింది. అయిన యువరాజు వేయబోతున్న రెండో బాణానికి అందకుండా పారిపోయి, తన గుహను చేరుకుంది.

ఆ తర్వాత సింహం కోతి వైద్యుడిని పిలిపించింది. కోతి వైద్యుడు అడవిలో ఏ జంతువుకి ఏ రోగం వచ్చినా మంచి వైద్యం అందిస్తూ ఉంటుంది. సరే ఆ కోతి వైద్యుడు సింహం నడుములో దిగబడ్డ బాణాన్ని లాగి, ఏవో పశర్లు పూసి కట్టు కట్టి వెళ్ళిపోయింది.


సింహం స్నేహితులు దిగాలుగా సింహం ప్రక్కనే నిల్చున్నాయి. అలా కొద్ది రోజులు గడిచాయి. సింహానికి గాయం తగ్గింది. కానీ శరీరంలో పూర్వపు శక్తి నశించింది. దాంతో జంతువుల్ని వేటాడే శక్తి కూడా పోయింది. పైగా ఎక్కడలేని నీరసంతో గుహలో నుంచి బయటికి నడిచే శక్తి కూడా లేకుండా పోయింది.

ఎప్పుడైతే సింహం వేటాడటం మానేసిందో కాకి, నక్క, తొడేళ్ళకి ఆహారం లేకుండా పోయింది. దాంతో సింహంతో సహా అవి మూడు

ఆకలికి డొక్కలు మాడి బక్కచిక్కాయి. కానీ వాళ్ళ మిత్రుడైన ఒంటె శాఖాహారి అంటే పచ్చి గడ్డి వగైరాలు తింటుంది.

కనుక దానికేమీ ఆహార కొరత రాలేదు. రోజు హాయిగా ఆ అడవిలో గడ్డీ, గాదం కడుపునిండా తిని తెగబలిసిపోసాగింది. ఇలా ఒక వారం గడిచింది.

ఒకరోజు సింహం తన మిత్రుల్ని పిలిచి ఇలా అన్నది. నాకు వేటాడే శక్తి నశించింది.



ప్రస్తుతం కనీసం ఈ గుహను విడిచి బయటికి వెళ్ళే ఓపిక కూడా లేదు. మీరంతా అడవిలోకి వెళ్ళి ఏదైనా జీవాన్ని వేటాడి తీసుకురండి. అందరూ కలిసి భోంచేద్దాం.

సింహం మాటలు విని నక్క, తొడేలు, కాకి, ఒంటె అడవిలోకి వెళ్ళి ఏదైనా జీవి దొరకుతుందేమో అని వెతక సాగాయి. వాటి దురదృష్టం వలన ఏ జంతువు వాటికి దొరకలేదు.

ఇంతలో నక్క బుర్రలో ఓ ఆలోచన వచ్చింది. ఆ దుష్ట నక్క తన స్నేహితులు అయిన కాకి, తొడళ్ళను దగ్గరగా పిలిచి, ఇలా చెప్పింది. ఈ ఒంటె గడ్డీ, ఆకులు తిని తెగ బలిసింది.

దీన్ని కనుక సింహంచేత చంపించం అంటే మనకు నెల రోజులు హాయిగా విందు చేసుకోవచ్చు.

నక్క మాటలు విని తొడేలు, కాకి సంబర పడ్డాయి. దూరంగా నిల్చుని గడ్డి తింటున్న ఒంటెకి తనపై జరుతున్న కుట్ర తెలీక అమాయకంగా

చూస్తున్నది. సరే, సరే అంటే అనుకుని నక్క ఒక్కటే సింహం దగ్గరికి వెళ్ళి ఇలా అన్నది.

"ఓ సింహరాజా! ప్రస్తుతం మీరు తిండిలేక ఆకలితో బాధ పడుతున్నారని తెలిసి ఈ అడవిలో అన్ని జంతువులు బాధపడుతున్నాయి. మీ కోసం అవన్నీ ప్రాణత్యాగం చేసి, మీకు ఆహారం అవ్వాలని భావిస్తున్నాయి. మీరు కనుక అంగీకరిస్తే, ముందుగా మన ఒంటె మిత్రుడు మీకు ఆహారం అవుతాడట."

నక్క మాటలు విని ఆగ్రహించిన సింహం ఓరి కుటిలుడా! ఎంత ఆకలి వేస్తే మాత్రం మనతో ఇన్నాళ్ళుగా ఉన్న ఆ అమాయకపు ఒంటెను ఎలా చంపగలననుకున్నావు.


ఈ ఆకలితో బాధనైనా భరిస్తాను కానీ, నమ్మిన మిత్రుడిని చంపను అన్నది. అప్పుడు నక్క గజ, గజలాడుతూ అయ్యా సింహరాజా! మీరు నన్ను పూర్తిగా అపార్థం చేసుకున్నారు.రాజైన మీరే ఆకలితో మరణిస్తే, ఈ అడవిలోని మిగిలిన జంతువులకి ఎవరు రక్షణ కల్పిస్తారు. అని సింహాన్ని మంచి మాటల్తో ఒంటెను చంపటానికి అంగీకరింపచేసింది.


ఆ తర్వాత ఒంటె దగ్గరికి వెళ్ళి, ఓయి ఒంటె మిత్రమా! మన రాజుగారు ఆకలితో చావటానికి సిద్ధంగా ఉన్నారు. ఆయన స్నేహితులం అయిన మనం మన ప్రాణాలు ఇచ్చి అయినా సరే ఆయన్ని కాపాడుకోవాలి అని నీతి సూక్తులు వల్లించింది.

నక్క చెప్తున్న మాటల్ని విన్న ఒంటె రాజుగారి కోసం చావటానికి సిద్ధపడింది. ఆ తర్వాత ఒంటె, కాకి, నక్క, తొడేలు కలిసి, రాజుగారి దగ్గరికి వెళ్ళి తమని చంపి ఆకలి తీర్చుకోమని అడిగాయి. సింహం ఏం చెయ్యాలో అర్థంకాక అలా చూస్తూ ఉండిపోయింది.

అప్పుడు ఒంటె ముందుకి వచ్చి, ఓ సింహ మిత్రమా ఈ కాకి నక్క, తొడేలు చాలా చిన్న శరీరాన్ని కలిగి ఉన్నాయి. నాది భారీ శరీరం. మీరు నన్ను చంపితే వారం, పది రోజులు మీకు ఆహారం లభిస్తుంది. మీకు ఆహారం అయిన నాకు పుణ్యం వస్తుంది. కనుక ఏమీ ఆలోచించకుండా నన్ను సంహరించండి అన్నది.

ఇక సింహం ఆకలికి ఆగలేక ఒంటె పైకి లంఘించి, తన పంజాతో ఒంటెని ఒక్క దెబ్బతో చంపివేసింది. ఆ తర్వాత నక్క, తొడేలు, కాకి






సింహంతో కలిసి ఆ ఒంటె మాంసాన్ని తృప్తిగా భుజించాయి. నక్క పన్నిన కుట్రకు బుద్ధిలేని ఒంటె బలి అయిపోయింది.

నీతి : దుష్టులతో స్నేహం వల్ల ఎప్పటికైనా ముప్పు తప్పదు.

నువ్వా? నేనా?

పూర్వ కాలంలో ఒక ఊరి చివర ఉన్న స్మశానంలో ఒక పెద్ద ఊడల మర్రి చెట్టుపైన అనేక వందల కాకులు జీవిస్తూ ఉండేవి. ఆ కాకుల రాజు పేరు నీలపర్ణుడు. అంటే నీలం రంగు రెక్కలు గలవాడు



అని అర్థం. ఆ స్మశానానికి రెండు క్రొసుల దూరంలో ఉన్న కొండ గుహలో వేల కొద్ది గబ్బిలాలు జీవిస్తూ ఉండేవి. వాటి నాయకుడు నిశిరాజు. అంటే రాత్రికి రాజు. అంటే చంద్రుడు అని అర్థం.

ఇది ఇలా ఉండగా చెట్టుమీద ప్రశాంతంగా జీవిస్తున్న కాకులకి ఒక సమస్య వచ్చి పడింది. అదేమంటే కాకులకి రాత్రిపూట కనిపించదు. కానీ గుడ్లగూబలకి రాత్రిళ్ళు మాత్రమే కళ్ళు కనిపిస్తాయి. అది రాత్రిళ్ళు మాత్రమే ఆహారం కోసం గుహ బయటికి వస్తుంటాయి. అందుకే గుడ్లగూబల్ని నిశాచరులు అంటారు. అంటే రాత్రిళ్ళు సంచరించే వాళ్ళు అని అర్థం.



గుడ్లగూబలకి, కాకులకి జన్మ విరోధం ఉన్నది. పైగా గుడ్లగూబలకి, కాకులు ఇష్టమైన ఆహారం. దాంతో గుహలోని గుడ్లగూబలు రాత్రి సమయంలో కాకులు నివాసం ఉంటున్న మర్రిచెట్టు పైకి దాడి చేసి కాకుల్ని చంపితింటూ ఉండేవి.

ఇలా గుడ్లగూబల దాడిలో ఇంకా రెక్కలు రాని కాకి పిల్లలు సైతం మరణించేవి. తన పాలనలో ఉన్న కాకులు ఇలా దిక్కుమాలిన చావు చావటంతో ఆ కాకుల రాజైన నీలపర్ణుడు చాలా విచారించి, తన మంత్రుల్ని పిలిచి ఏం చెయ్యాలి అని సలహా అడిగాడు.

అప్పుడు కొందరు మంత్రులు లేచి బలవంతులైన గుడ్లగూబల్ని మనం ఏం చేయలేం. అందువల్ల మనం క్షేమంగా ఉండే వేరే ప్రదేశానికి వెళ్ళటం మంచిది అని చెప్పారు.

అప్పుడు 'సుబుద్ధి' అనే ముసలి మంత్రి లేచి, నీలపర్ణుడితో ఇలా అన్నాడు. ఓ రాజా! నిజమైన వీరులెవరూ, శత్రువుని చూసి భయపడి మాతృదేశాన్ని వదలి పారిపోరు.

ఆ గుడ్లగూబలు బలమైనవే కావచ్చు. అంత మాత్రన మనం భయపడి పలాయన మంత్రం పఠించాల్సిన అగత్యం లేదు. బలవంతుడైన శత్రువుని యుక్తిగా సంహరించాలి. అప్పుడు కొన్ని కాకులు ముసలి మంత్రి మాటల్ని లెక్కించకుండా, గుడ్లగూబల దాడికి భయపడి వేరే చోటుకి వెళ్ళి తీరాలని పట్టుబట్టాయి.

అప్పుడు వృద్ధమంత్రి, కాకుల రాజైన నీలపర్ణుడికి ఇలా సలహా ఇచ్చాడు. ఓ రాజా! నీవు నీ పరివారంతో సహా ఇక్కడికి యోజనం దూరం (అంటే 8 మైళ్ళు)లో ఉన్న ఒక మహా వృక్షం పైన జీవించటానికి వెళ్ళిపో, వెళ్ళే ముందు నన్ను తీవ్రంగా గాయ పరిచినట్లు నటించు. అప్పుడు మన శత్రువులైన గుడ్లగూబల పక్షంలో చేరి వాళ్ళకి అనుకూలంగా నటిస్తూ, వీలు చూసి, వాళ్ళని సర్వనాశనం చేస్తాను.

అందుకు సమ్మతించి కాకుల రాజు అయిన నీలపర్ణుడు ముసలి కాకిని ముక్కుతో పొడిచి గాయపరచి నట్లు నటించి, ఒక చనిపోయిన కాకి రక్తం ముసలి కాకికి అంటించి చెట్టు మీద నుండి క్రిందికి తోసేసాడు.

ఆ తర్వాత ఆ నీలపర్ణుడు తన పరివారంతో సహా దూరప్రాంతంలో ఉన్న ఇంకొ చెట్టుపైకి నివశించటానికి ఎగిరి పోయాడు. ఆ రోజు రాత్రి గుడ్లగూబలు కాకులుండే చెట్టుపైకి దాడికి వచ్చాయి. కానీ అక్కడ కనీసం ఒక కాకి గుడ్డు కూడా కనిపించక ఆశ్చర్య పడ్డాయి.

అయితే ఆ చెట్టు క్రింద గాయాలతో పడి ఉన్న ముసలి కాకి కనబడింది. దాంతో గుడ్లగుబల రాజు నిశాచరుడు ఆ ముసలి కాకిని సమీపించి ఎవరు నీవు ఇలా పడి ఉన్నావు. మిగిలిన కాకులు ఎక్కడకి వెళ్ళాయి అని ప్రశ్నించాడు.

దానికి ముసలికాకి, దుఃఖ స్వరంతో ఇలా అన్నది. ఓ నిశాచర రాజా! నేను ఇక్కడ గతంలో ఉన్న కాకులకు మంత్రిని. మీరు మా కాకుల్ని రాత్రివేళలలో దాడిచేసి చంపుతున్నందుకు పగ పట్టిన మా రాజు నీలపర్ణుడు ఎలాగైనా మీ గుడ్లగుబల్ని అంతం చేస్తానని పంతం పట్టాడు.

అప్పుడు నేను కల్పించుకొని బలవంతులైన గుడ్లగూబలతో మనకి విరోధం తగదు. మనం మన కన్నా అధికులు అయిన గుడ్లగూబల్ని గౌరవించాలి అని చెప్పగా, మా రాజు నన్ను తీవ్రంగా గాయపరిచి, శత్రువులకి వంతపాడినందుకు, నన్ను ఈ చెట్టు మీద నుండి క్రిందికి తొసివేసి తన పరివారంతో హిమాలయాలకు ఎగిరి పోయాడు.

అప్పుడు గుడ్లగూబల రాజు నిశాచరుడు ముసలి కాకిని చూసి జాలి పడి తమ గుహకు వచ్చి హాయిగా జీవించమని అడిగాడు. దానికి

ఇతర గుడ్లగూబలు అడ్డు చెప్పాయి. అవి వాటి రాజైన నిశాచరుడితో ఇలా అన్నాయి. "ఓ రాజా! ఈ కాకి మన ఆజన్మ శత్రువు. అలాంటి శత్రువుని కొరి కొరి మన ఇంట్లోకి ఆహ్వానించటం అంటే, కోరి ప్రమాదాన్ని తెచ్చుకున్నట్లే, కనుక ఈ కాకిని ఇలానే వదిలేసి మన దారిన మనం పోదాం.

అప్పుడు నిశాచరుడు మనల్ని శరణు కోరిన ఈ బలహీన, ముసలి కాకి వల్ల మనకి ఏలాంటి హాని ఉండదు అన్నాడు. దాంతో కొన్ని గుడ్లగూబలు రాబోయే ప్రమాదాన్ని శంకించి, వేరే గుహకు ఎగిరిపోయాయి. అటు పిమ్మట ముసలి కాకి గుడ్లగుబల గుహలో నివశించటం మొదలు పెట్టింది.

గుడ్లగూబలకి పగటి పూట కనిపించదు కనుక ముసలికాకి పగటి పూట అక్కడ, అక్కడ చిన్న చిన్న కర్రలు చితుకులు సేకరించి ఆ గుడ్ల గూబల గుహ ముఖద్వారం దగ్గర పేర్చసాగింది. అయితే బుద్ధిహీనులైన గుడ్లగూబలు కాకి చేస్తున్న కుటిల ప్రియత్నాలను తెలుసుకోలేక పోయాయి. ఇలా కొన్ని నెలలు గడిచాయి. కాకి, గుడ్లగూబల గుహ ద్వారం దగ్గర చాలా పరిమాణంలో చితుకులు, పిల్లలు నిల్వ చేసింది.



ఒక రోజు ఉదయం కాకులు నివాసం ఉంటున్న చెట్టు దగ్గరకు వెళ్ళి తమ రాజు నీలపర్ణుని కలిసి రేపు ఉదయం మీరంతా వచ్చి గుడ్లగూబలున్న గుహ ద్వారం ముందు ఉన్న చితుకుల్ని అంటించండి. అప్పుడు ఆ గుహలో ఉండే గుడ్ల జీవులు చనిపోతాయి. పగలు వాటికి కళ్ళు కనిపించవు. కనుక మీరు గుహ ద్వారం దగ్గర మంటలు పెట్టినా అవి బైటికి రాలేవు. అని చెప్పి మరలా గుడ్లగూబల గుహకి వచ్చింది.

పగలంతా కళ్ళు కనిపించని ఆ గుడ్లగూబలు కాకి బయటికి వెళ్ళి రావటం గమనించలేకపోయాయి. ఆ మర్నాటి ఉదయం కాకులన్నీ

గుంపుగా వచ్చాయి. గుడ్లగూబలున్న గుహలో ఉంటున్న ముసలి కాకి బయటికి వచ్చి ఇంతకాలంగా తాను పోగుచేసి ఉంచినా చితుకులని ఆ గుహ ముఖ ద్వారానికి అడ్డంగా పేర్చి, ఆ పుల్లలకి నిప్పు అంటించమని కాకుల రాజు నీలపర్ణుడికి సలహా ఇచ్చింది.

దాంతో ఆ కాకుల రాజు, కొన్ని కాకుల్ని పిలిచి, ఎక్కడి నుండి అయిన ఒక మండే కట్టెను తెచ్చి గుహ ముఖ ద్వారం వద్ద పేర్చిన చితుకులకి నిప్పు అంటించమని ఆజ్ఞాపించాడు.


వెంటనే కాకులు రాజు చెప్పిన ఆజ్ఞని అక్షరాల అమలు చేసాయి. దాంతో ఆ గుహలో తల్లక్రిందులుగా వ్రేలాడుతున్న వేలాది గబ్బిలాలు, ఆ గుహలోంచి బయటికి రాలేక ఆ గుహలోనే అగ్ని సమాధి అయ్యాయి.

ఈ విధంగా ముసలి కాకి నేర్పు, తెలివి, సాహసం వల్ల కాకులకి శత్రుభయం పోయింది. ఆనాటి నుండి ఆ కాకులు యథావిధిగా గతంలో నివశించిన ఊడల మర్రి చెట్టుపైనే నివాసం ఉండసాగాయి.

నీతి : శత్రువుని చేరదీస్తే ప్రమాదం తప్పదు.

పెద్దల మాట చద్ది మూట

బిక్కవోలు అనే గ్రామంలో సత్తెమ్మ అనే వృద్ధురాలు జీవిస్తూ ఉండేది. ఆమెకు 'కామేశం' అనే మనవుడు ఉండేవాడు. సత్తెమ్మ కొడుకు కోడలు గోదావరీ నది వరదల్లో చనిపోగా పసి గుడ్డుగా ఉన్న 'కామేశాన్ని' గారాబంగా పెంచి పెద్ద చేసింది. ఎంత గారాబంగా పెరిగినా, కామేశం బాగా చదువుకుని, క్రమశిక్షణాతో జీవించేవాడు. ఇలా రోజులు గడుస్తున్నాయి.



కొన్నాళ్ళకి బిక్కవోలు గ్రామానికి దగ్గరగా ఉన్న పట్టణంలో ఉంటున్న ఒక సంపన్నుడి కుమార్తెను కామేశానికి ఇస్తామని పెళ్ళిళ్ళ పేరయ్య ద్వారా సత్తెమ్మకు కబురు చేసారు ఆ సంపన్నుడి

బంధువులు. దాంతో సత్తెమ్మ మనవడికి ఈ విషయం చెప్పి, పట్నం వెళ్ళి పెళ్ళి కూతురిని చూసి రమ్మన్నది.

సరే అని ప్రయాణానికి సిద్ధం అయ్యాడు కామేశం. అప్పుడు సత్తెమ్మ తన మనవడితో ఇలా అన్నది. నాయనా! కామేశం మనిషి ఎప్పుడూ ఒంటరిగా కొత్తచోటుకి వెళ్ళకూడదు. పోనీ నేను, నీకు తోడు వద్దామంటే నాకు కీళ్ళ నెప్పులు. అంత దూరం నడవలేను. అందువల్ల ఎవరినైనా తొడు తీసుకెళ్ళు అన్నది.

ఆమె మాటల్ని తీసిపారేస్తూ కామేశం ఇలా అన్నాడు. పోబామ్మా! నీదంతా చాదస్తం నేనింకా పిల్లాడిని అనుకుంటున్నావా? నాకు ఇరవై ఏళ్ళు వచ్చాయి తెలుసా? కామేశం మాటలకి నవ్వి సత్తెమ్మ వారేయ్ నీవెంత పెద్దవాడివి అయినా పెద్ద వాళ్ళు అనుభవంతో చెప్పే మాటల్ని పాటించపోతే నష్టం నీకే గుర్తుంచుకో అన్నది.

దాంతో కామేశం నిదానించి సరే ఎవర్ని తోడు తీసుకెళ్ళమంటావో చెప్పు అన్నాడు. అప్పుడు సత్తెమ్మ ప్రక్క ఇంటి వాళ్ళ ఇంటిలో పెరుగుతున్న ఒక కుక్క పిల్లను తెచ్చి కామేశానికి ఇచ్చి, దాన్ని నీకు తోడుగా తీసుకెళ్ళి మళ్ళీ జాగ్రత్తగా తెచ్చి, ప్రక్కింటి వాళ్ళకి అప్పచెప్పు అన్నది.

సరే అని కామేశం ఆ కుక్క పిల్లను ఒక సంచీలో పెట్టుకొని భుజానికి తగిలించుకొని నెత్తి మీద ఆహారం, నీళ్ళు, దుస్తులు ఉన్న సంచీ పెట్టుకొని పట్నం బయలుదేరాడు. అలా నడుస్తూ, నడుస్తూ కామేశం ఒక అడవిలాగా ఉన్న ప్రదేశానికి చేరాడు.

ఇంకా సగం దూరం నడిస్తే కానీ పట్నం రాదు. అసలే అది వైశాఖ మాసం కావటంచేత సూర్యుడు నడినెత్తికి వచ్చేసరికి ఎండ మంటలు పుట్టిస్తున్నది. ఇంకొ ప్రక్క ఆకలి, దాహం వేయటంతో కామేశం కాస్త ఆహారం తిని, కాస్సేపు విశ్రాంతి తీసుకుందామని భావించి దగ్గరలో ఉన్న ఒక పెద్ద మామిడి చెట్టు నీడ క్రిందికి చేరాడు.

చెట్టు క్రిందికి చేరగానే కామేశానికి పోయిన ప్రాణం తిరిగి వచిచనట్టు అనిపించింది. భుజాని కున్న సంచీని, నెత్తి మీదున్న సంచీని తీసి నేలపై పెట్టి తాను కూడా తాపీగా నేలపై కూర్చున్నాడు. అప్పటిదాకా సంచీలో ముడుచుకొని కూర్చొన్న కుక్క పిల్ల గభాల్న క్రింద పెట్టిన సంచీలోంచి బయటికి దూకి కామేశం కేసి చూడసాగింది. కామేశానికి అర్థం అయింది. ఆ కుక్కపిల్ల కూడా మంచి ఆకలి మీద ఉన్నదని. వెంటనే ఆహారం ఉన్న సంచీలోంచి కొన్ని రొట్టెలు, పెరుగన్నం, మంచి నీళ్ళు సొరకాయ బుర్ర తీసి బయట పెట్టాడు. ఆహారాన్ని చూడంగానే కుక్క పిల్ల ఆత్రంగా తోక ఊపటం మొదలెట్టింది.

కామేశం చిన్నగా నవ్వుకుని రెండు రొట్టెలు కుక్క పిల్లకి వేసి, తను ఆహారం తీసుకున్నాడు. ఆ తర్వాత కాసిని నీళ్ళు కుక్క పిల్లకు త్రాగించి మిగిలినవి త్రాగాడు.

బాగా నడిచి ఉన్నాడేమో, బాగా అలసటగా అన్పించి ఖాళీ సంచుల్ని, బట్టల్ని కలిపి, తలక్రింద దిండులా పెట్టుకొని నిద్రలోకి జారుకున్నాడు. కుక్క పిల్ల వికృతంగా అరవటం విని ఉలిక్కి పడి నిద్రలేచి కూర్చున్నాడు కామేశం.

ఏమిటి కుక్క పిల్ల అదేపనిగా అరుస్తున్నదేమిలా అని చుట్టూ పరిశీలనగా చూసాడు. అతనికి చాలా దగ్గరలో రెండు నల్లత్రాచులు పడగలెత్తి కామేశం కేసి చూస్తున్నాయి. ఆ పాముల్ని చూసిన కామేశం హడలిపోయాడు.



అయినా ధైర్యాన్ని చిక్కబట్టుకొని కుక్క పిల్లని, సంచుల్ని తీసుకుని వేగంగా ఆ చెట్టు క్రింది నుండి ఎండలోకి వెళ్ళాడు. అత్యంత వేగంగా వెళ్ళిపోతడని ఊహించని పాములు కాస్సేపు అలాగే ఉండి ఆ తర్వాత జర, జరమని ప్రాకుకుంటూ దగ్గరలోని పుట్టలోకి వెళ్ళిపోయాయి.

కామేశం బ్రతుకు జీవుడా అని నిట్టూర్చి నిద్రలో ఉన్న తనని లేపి, పాము కాటుకి గురి అవకుండా ఆపిన కుక్కపిల్లను ముద్దు పెట్టుకొని, మళ్ళీ నడక సాగించాడు.

అతనికి అప్పుడు అర్థమయింది. మామ్మ చెప్పినట్టు విన్నాడు కనుక తాను విషజంతువుల బారిన పడి చావకుండా బ్రతికాడు అని. ఆ సాయంత్రానికి కామేశం పట్టణంలోని సంపన్నుడి ఇంటికి చేరి పెళ్ళి పనులు కానిచ్చాడు.

నీతి : పెద్దల మాట చద్ది మూట. ఇది విన్నడూ తప్పరాని బంగారు బాట.

చేటు తెచ్చిన ఉత్సాహం

సబ్బవరం అనే గ్రామంలో దేవుడి గుడి ఉంది. కానీ బడి లేదు. అందువల్ల ఆ ఊరి పిల్లలు చాలా దూరం నడిచి పట్నం వెళ్ళి చదువుకోవాల్సి వచ్చింది. దాంతో ఆ ఊరి పెద్దలు ఆ రాజ్యాన్ని పాలిస్తున్న రాజుగారి దగ్గరకు వెళ్ళి తమ ఊరిలో ఒక పాఠశాలను నిర్మించమని ప్రార్థించారు. ఆ రాజుగారు విశాల హృదయుడే కాక, బాగా చదువుకున్నవాడు. దాంతో సబ్బవరం గ్రామంలో ఒక పాఠశాల నిర్మింస్తానని గ్రామ పెద్దలకి వాగ్దానం చేసి పంపేసాడు.

కొన్ని రోజుల తర్వాత రాజుగారు ఒక మంత్రిని పిలిచి ఇలా అన్నాడు. మంత్రి వర్యా! మీరు అవసరమైన ఆ ధనాన్ని, పనివాళ్ళని తీసుకొని సబ్బవరం గ్రామానికి వెళ్ళి, అక్కడ ఒక పాఠశాల భవనం నిర్మించి రండి. దానికి ఆ మంత్రి సరేనని కావాల్సిన ధనం మనుషుల్ని తీసుకొని సబ్బవరం బయలుదేరాడు.


ఆ తర్వాత సబ్బవరం గ్రామ పెద్దలు చూపించిన విశాలమైన ఖాళీ స్థలంలో భారీపరిమాణంలో ఉండే ఒక పాఠశాల భవనాన్ని నిర్మించటం మొదలు పెట్టించాడు ఆ మంత్రి. పునాదులు లేచాయి.

ఆ తర్వాత గొడలు కట్టబడ్డాయి. అయితే ఈలోగా ఒక సంఘటన జరిగింది. అదేమంటే ఆ భవన నిర్మాణం జరిగే స్థలానికి దగ్గరలో ఒక

నేరేడు చెట్టు ఉన్నది. ఆ చెట్టుపై చాలా కోతులు పగలంతా ఆడుకుంటూ, నేరేడు కాయలు తింటూ కాలక్షేపం చేస్తుంటాయి. అయితే ప్రక్క స్థలంలో జరుగుచున్న భవన నిర్మాణం చూసి ఆ కోతులు ఆసక్తిగా అటువైపు వెళ్తు ఉండేవి. కోతుల వల్ల ఎలాంటి ప్రమాదం రాదు కనుక భవన కార్మికులు ఈ కోతుల్ని ఆవతలకి తొలటం కానీ, వాటిపైకి రాళ్ళు విసరటం కానీ చేసేవాళ్ళుకాదు.

పైగా వాళ్ళు తినే ఆహారంలో కొంత భాగం ఆ కోతులకి వేసి ఆనందించేవాళ్ళు. ఒక రకంగా అక్కడున్న కోతుల చర్యల్ని ఆ నిర్మాణ కూలీలు వినోదంగా భావించేవాళ్ళు.

ఇలా కాలం జరుగుతున్నది. ఆ భవనం పైకప్పు వేసేరోజు వచ్చింది. ఆ కాలంలో భవనానికి కప్పు వేయటానికి ముందు, భారీపరిమాణంలో ఉండే దుంగలను గొడలపై అడ్డంగా పరిచి ఆపై సున్నం, ఇసుక లాంటివి



కలిపి రాళ్ళతో ఆ దుంగలపై కప్పువేసే వాళ్ళు. అలా చేస్తున్న సమయంలో ఒకరోజు ఇద్దరు కూలీలు ఒక పెద్ద చెట్టు దుంగని రంపంతో అడ్డంగా కోస్తున్నారు.

మధ్యాహ్నం అయేసరికి భోజనం చెయ్యటానికి వెళ్ళాలని ఆ ఇద్దరు పనివాళ్ళు భావించారు. కానీ దుంగని సగమే కోసి ఉండటం వలన ఆ దుంగని కోసిన ప్రాంతంలో ఒక బలమైన కర్రని రెండు చీలికల మధ్య ఉంచి, ఆహారం తీసుకోవటం కోసం వెళ్ళిపోయారు.

వాళ్ళు అలా వెళ్ళారో లేదో, ఒక డజను కోతులు ఆ ప్రదేశానికి వచ్చి అక్కడున్న నిర్మాణా పరికరాలతో ఆడుకోసాగాయి. కొన్ని కోతులు అక్కడున్న కొడవళ్ళు తీసుకొని అటు, ఇటు ఊపాయి. కొన్ని కోతులు అక్కడ వరుసగా పెట్టిన చెక్కలపై ఎక్కి గెంతసాగాయి. ఒక పిల్ల కోతి మాత్రం దూరంగా సగం కోసి ఉంచబడిన చెట్టు దుంగ దగ్గరికి వెళ్ళి పరిశీలనగా చూసింది.

ఆ తర్వాత ఆ కొయ్య దుంగపై ఎక్కి క్రిందికి దూకింది. ఆపై ఆ దుంగలో చీలిక ఉన్న ప్రాంతంలో కాళ్ళు పెట్టి సగం వరకూ కోసిన దుంగ మళ్ళీ దగ్గరగా రాకుండా ఉండటానికి పనివాళ్ళు ఆ చీలిక మధ్య ఉంచిన శిలపై చేతులు వేసి ఆ శిలను అటు, ఇటు ఊపసాగింది.

ఆ శిల చాలా బలంగా ఉండటం వల్ల ఊడి రాలేదు. దాంతో ఆ పిల్లకోతి తన బలం అంతా ఉపయోగించి రెండు చేతులతో ఆ శిలను బలంగా ఉపసాగింది.

ఇంతలో ఆ కోతి ఖర్మకాలి ఆ శిల ఊడి కోతి చేతికి వచ్చింది. శిల అలా బయటికి వచ్చిందో లేదో రెండు చీలి ఉన్న ఆ దుంగ ధాంమన్న శబ్దంతో ఒకటిగా అతుకున్నది. పిల్లకోతి ఒక్కసారిగా బిగ్గరగా అరిచి ప్రాణం వదిలింది.

ఈ హడావుడికి భోజనాలు చేస్తున్న పనివాళ్ళు పరిగెత్తుకు వచ్చి చూసారు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి వాళ్ళకి దిమ్మతిరిగింది. ఏముంది అక్కడా? దుంగ చీలికల మధ్య ఉంచిన శిలను పీకిన కోతి క్రింద భాగం చితికి పోయింది. తనకు సంబంధంలేని విషయంలో అతి ఉత్సాహం ప్రదర్శించిన పిల్లకోతి నిష్కారణంగా ప్రాణాలు కోల్పోయింది.

నీతి : ముందుచూపు లేకుండా ఏ పనీ చేయరాదు.

కుక్క కాటుకి చెప్పు దెబ్బ

పూర్వం ఓరుగల్లు అనే పట్టణంలో నారాయణ, శర్మ అనే ఇద్దరు ఆప్త మిత్రులు ఉండేవారు. వాళ్ళ స్నేహాన్ని చూసి ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు కూడా ఆశ్చర్యపడేవాళ్ళు. ఇలా కొన్ని ఏళ్ళు గడిచాయి. ఒకసారి నారాయణ తన కూతురికి పెళ్ళి చేయాలని అనుకున్నాడు. కానీ అతని దగ్గర తగినంత డబ్బులేక ఆగిపోయాడు.

ఆ విషయం తెల్సిన శర్మ మిత్రుడి ఇంటికి వచ్చి ఒరేయ్ మూర్ఖుడా లక్షాధికారి అయిన నన్ను మిత్రుడిగా కలిగి ఉన్న నీవు కొద్దిపాటి డబ్బులేక కూతురు పెళ్ళి ఆపుతావా, నీకెంత కావాలో చెప్పు. ఇస్తా అన్నాడు.

శర్మ మాటలు విని నారాయణ చాలా ఆనందించి మిత్రమా! నీ గుణం నాకు తెలుసు. కానీ ఎంత మిత్రుడివి అయినా డబ్బు అడిగి మన స్నేహాన్ని అగౌరవపరచటం ఇష్టం లేక నిన్ను అడగలేదు. నిజానికి నీ కన్నా నాకు ఎవరు ఆప్తులు అన్నాడు. సరే శర్మ బలవంతం మీద ఒక రెండు వేల రూపాయలు కూతురి పెళ్ళికోసం అప్పుగా తీసుకొని కూతురి పెళ్ళి ఘనంగా చేసి, తన బాధ్యత దింపుకున్నాడు నారాయణ.



కొద్ది నెలలు గడిచాయి. ఒక రోజు నారాయణ దగ్గరికి వచ్చాడు శర్మ. మిత్రుడిని ఆదరంగా లోనికి పిలిచాడు నారాయణ. కాస్త సమయం గడిచాక శర్మ, నారాయణతో ఇలా అన్నాడు. ఇదిగో నారాయణా! నీవు నాకివ్వాల్సిన డబ్బు వెంటనే ఇచ్చేయ్యాలి.

శర్మ మాటలకి కొంత ఆశ్చర్యపడ్డ నారాయణ త్వరలో ఇచ్చేస్తాను అన్నాడు. అదేం వీలుకాదు నాకు నా డబ్బు అయినా తిరిగి ఇవ్వు. లేదా నీ ఇల్లు అయినా నాకు రాసి ఇవ్వు అన్నాడు. కొంచెం అక్కసుగా. శర్మ మాటలతో నారాయణకి, శర్మ ఎంత కుత్సితుడో అర్థమయి. నీ డబ్బు ఒక వారంలో ఇస్తా అన్నాడు కొంచెం రోషంగా. అప్పుడు శర్మ అదేం కుదరదు. మర్యాదగా ఇప్పుడే ఇవ్వు. లేదా రాజుగారి దగ్గరికి వచ్చి నీ ఇంటి మీద నా దగ్గర అప్పు తీసుకున్నానని అంటే తాకట్టు పెట్టానని చెప్పు అన్నాడు అక్కసుగా.

దానితో నారాయణ ఇంత చిన్న విషయానికి రాజుగారి దగ్గరికి ఎందుకు అన్నాడు. కానీ శర్మ, నారాయణను రాజుగారి దగ్గరికి వచ్చి తీరాలని పట్టుపట్టాడు. దాంతో నారాయణకు అర్థమయింది. ఈ శర్మ దురాశతో తన ఇల్లు ఏదో విధంగా కాజేయాలని చూస్తున్నాడని. సరే అంత సన్నిహిత మిత్రుడే ద్రోహిగా మారి తనని వంచించాలని చూస్తున్నప్పుడు ఇంకా మంచిగా ఉండి ప్రయోజనం ఏముంది అని భావించి శర్మతో ఇలా అన్నాడు.

శర్మా! నీకు తెలుసు నేను చాలా పేదవాడినని, రాజాస్థానానికి వెళ్ళాలంటే మంచి మంచి దుస్తులు, చెప్పులు తలపాగా, భుజంపై పట్టు కండువా, వెళ్ళటానికి గుర్రపు బండీ కావాలి అవి నా దగ్గర లేవు. అప్పుడు శర్మ, నారాయణ నీవు అడిగినవి అన్నీ నేను ఏర్పాటు చేస్తాను. నువ్వు బయలుదేరు అన్నాడు ఆత్రంగా.

శర్మ ఇచ్చినవి ధరించి గుర్రపు బండీ ఎక్కి, రాజుగారి దర్బారుకి వెళ్ళాడు నారాయణ. అతని తర్వాత శర్మ కూడా రాజదర్బారీకి చేరాడు. రాజదర్బారులో ఒక మంత్రి, ధన సంబంధ వివరాలు పరిష్కరిస్తూ ఉంటాడు. ఆ మంత్రిని ముందుగా నారాయణ కలిసి, మంత్రి వర్యా! నా మిత్రుడు శర్మకి ఈ మధ్య చిత్తచాంచల్యం వచ్చి, నావన్నీ తనవే అనీ, అవన్నీ తనకి తిరిగి ఇచ్చేయాలని పట్టుబడుతున్నాడు అన్నాడు.

నారాయణ చెప్పింది విన్న న్యాయశాఖ మంత్రి శర్మను తన వద్దకు తీసుకురమ్మని భటుడ్ని పంపాడు. క్షణాల్లో శర్మ న్యాయమంత్రి దగ్గర హాజరు

పరచబడ్డాడు. అప్పుడు నారాయణ, శర్మతో ఇలా అన్నాడు. శర్మా! నేను ధరించిన ఈ పట్టు బట్టలు, పట్టు కండువా ఎవరివి?

దానికి శర్మ అవును, నీవు ధరించిన బట్టలు నావే అన్నాడు. తర్వాత నారాయణ నేను ధరించిన తల పాగా ఎవరిది అన్నాడు. వెంటనే శర్మ నీవు ధరించిన పాద రక్షలు తలపాగా నావే అన్నాడు.

అప్పుడు నారాయణ చూసారా మంత్రిగారు, ఈ శర్మ ధోరణి నేను కట్టుకున్న దుస్తులు కూడా తనవే అంటున్నాడు. ఇంకాసేపు ఆగితే నేను వచ్చిన నా గుర్రపు బండీ కూడా తనదే అని అనగలడు అన్నాడు. భయం నటిస్తూ... వెంటనే శర్మ కోపంగా ఒరేయ్ నారాయణ నీకెమన్నా పిచ్చా, నా బట్టలు, చెప్పులు, తలపాగా తీసుకొని ఇప్పుడు నావి కాదంటావా పైగా నా గుర్రపు బండీ, నీది అని చెపుతున్నావా అని అరిచాడు.

దాంతో న్యాయమంత్రి ఇలా అన్నాడు. ఈ శర్మకు మతి చలించింది. కనుక ఇతను చెప్పే మాటలు నేను నమ్మను అన్నాడు. అక్కడున్న జనాలు కూడా శర్మను చూసి హేళనగా నవ్వారు. దాంతో శర్మకు పరువు పోయి, ఇంటికి వెళ్ళిపోయాడు. నారాయణ, మిత్రుడి ద్రోహానికి తగిన ప్రతీకారం చేసాడు.

నీతి : మేధస్సు ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించవచ్చు.

మోసకారి నక్క

పూర్వం నేపాల్ అడవుల్లో ఒక మృగరాజు ఉండేది. దానికి ఒక నక్క, ఒక తొడేలు సలహాదారులుగా ఉండేవి. ఒకసారి ఆ సింహం ఒక ఆడ గుర్రాన్ని చంపింది. ఆ తర్వాత దాని పొట్ట చీల్చగా అందులో సజీవంగా ఉన్న ఒక గుర్రపు పిల్ల కనిపించింది. ఆ గుర్రపు పిల్లను చూసి సింహానికి జాలి వేసి దాన్ని చంపకుండా తన వద్ద ఉంచుకుని పెంచసాగింది.

కాలక్రమంలో ఆ గుర్రపు పిల్ల పెద్ద గుర్రంగా మారింది. సింహానికి సలహాదారులుగా ఉన్న నక్క, తొడుళ్ళకు ఆ బలిసిన గుర్రాన్ని చూస్తే నోరు ఊరేది. కానీ ఆ గుర్రం రాజుగారి పెంపుడు బిడ్డతో సమానం కనుక నొర్మూసుకొని ఉన్నాయి.

ఒకసారి ఆ సింహం ఒక అడవి దున్నల గుంపుపై దాడిచేసింది. అయితే ఆ మదించిన దున్నలు సింహాన్ని తమ కొమ్ములతో తీవ్రంగా గాయపరిచాయి. దాంతో సింహానికి చచ్చినంత పని అయింది. అలా అడవి దున్నల వల్ల తీవ్రంగా గాయపడ్డ సింహం బలహీన పడింది. దాంతో అది గుహ దాటి బైటికి వెళ్ళటం మానేసింది.


ఒకరోజు ఆ సింహం నక్క, తొడేలును పిలిచి ఏదైనా జంతువును మన గుహలోకి తరుముకు రండి దాన్ని నేను చంపేస్తాను. మనం హాయిగా దాన్ని తిందాం అన్నది. ఇక రాజుగారి మాట తీసివేయలేక తొడేలు, నక్క అడవి అంతా తిరిగాయి ఏదైనా జంతువు కనిపిస్తుందేమో అని కానీ వాటి దురదృష్టమా అన్నట్టుగా ఆ రోజు ఏ జంతువు వాటికి కనబడలేదు.

దాంతో తొడేలు, నక్క ఆకలితో ఒక చెట్టు క్రింద కూలబడ్డాయి. అప్పుడు జిత్తుల మారి నక్కకు ఒక ఆలోచన వచ్చింది. అదేమంటే సింహం గుహలో ఉన్న గుర్రాన్ని కనక చంపేస్తే ఒక వారం పాటు సుష్టుగా భోజనం చెయ్యవచ్చు. తనకు వచ్చిన ఈ ఆలోచనను ప్రక్కనే ఉన్న తొడేలుకి కూడా చెప్పింది.

ఆ ఆలోచన తొడేలుకి బాగా వచ్చింది. కానీ గుర్రాన్ని చంపుతే రాజుగారు మనల్ని చంపుతారు అన్నది సందేహంగా. అప్పుడు నక్క, ఔను మనం చంపితే సింహం ఖచ్చితంగా మనల్ని చంపుతుంది. అదే సింహం చేతిలో ఆ గుర్రాన్ని చంపించాం అనుకో మనచేతికి మట్టి అంటకుండా హాయిగా కావాల్సినంత గుర్రపు మాంసం లాగించవచ్చు అన్నది. ఆ నిర్ణయానికి వచ్చి గుర్రాన్ని దగ్గరగా పిలిచి ఇలా అన్నాయి.

ఓ మిత్రుడా! నీకు తెలుసు మన రాజుగారికి ఆరోగ్యం బాగాలేదని ఆయనకు గుర్రపు మాంసం పెడితే ఆరోగ్యం వస్తుందని అడవి వైద్యులు చెప్పారు అని. దానికి గుర్రం అయ్యో అలాగా, రాజుగారికి గుర్రపు మాంసం ఇస్తే ఆరోగ్యం చక్కబడుతుంది అంటే నేను మరణించి రాజుగారికి ఆహారం అవుతా అన్నది.

సరేలే నీకు ఇష్టమైతే సింహంగారికి ఏ అభ్యంతరం ఉండకపోవచ్చు అన్నాయి నక్క, తొడేలు. ఆ తర్వాత నక్క సింహం దగ్గరికి వెళ్ళి ప్రభూ! మీ కోసం మన గుర్రం మిత్రుడు ఆహారంగా మారతానని ప్రాధేయపడు తున్నాడు. మీరు, ఈ గుర్రాన్ని నిస్సంకోచంగా చంపి, ఆహారంగా స్వీకరించండి అని ప్రార్థించింది. మొదట సింహం గుర్రాన్ని చంపటానికి



అంగీకరించక పోయినా, ఆకలి బాధ తట్టుకోలేక అంగీకరించింది. గుర్రాన్ని గుహలోకి రమ్మని నక్క పిలిచింది. సింహం ఒకే ఒక్క దెబ్బతో గుర్రాన్ని చంపేసింది.

ఆ తర్వాత సింహం నక్కని తొడేల్ని పిలిచి గుర్రపు మాంసాన్ని తినే ముందు స్నానం చేస్తే మంచిది. కనుక నేను అలా నది దాకా వెళ్ళి స్నానం చేసి వస్తాను. ఈలోపు మీరు ఈ గుర్రపు మాంసాన్ని ఎవరూ ఎంగిలి చేయకుండా కాపాడండి అని చెప్పి స్నానం చేయటానికి నదికి వెళ్ళింది. ఇక గుర్రపు శరీరానికి నక్క, తొడేలు కాపలాగా ఉన్నాయి. వాటికి గుర్రపు మాంసం చూసి నోరూరి పోతున్నది. పైగా వారం రోజులు నుండి తిండిలేదు.

అయినా సింహం అంటే ఉన్న భయం వల్ల నోరు కట్టుకుని గుర్రం మాంసాన్ని కళ్ళప్పగించి చూస్తున్నాయి. అప్పుడు జిత్తులమారి నక్కకు ఒక ఆలోచన వచ్చింది. అదేమంటే సింహాన్ని, తొడేలుని కూడా ఆవతలికి తరిమివేస్తే ఆ మొత్తం గుర్రాన్ని తానే ఒక నెల రోజులు హాయిగా తినవచ్చు అనుకున్నది నక్క ఆలోచనగా. ఆలోచన తట్టిందే ఆలస్యం నక్క వెంటనే తన ఆలోచనను అమలులో పెట్టింది.

తొడేలుతో నక్క ఇలా అన్నది. ఓ తొడేలు బావా! నీవు ఆహారం తిని దాదాపు వారం రోజులు అయింది. కాస్త గుర్రపు మాంసం తినరాదా! ఆ మాటకి తొడేలు నాకూ తినాలనే ఉన్నది కానీ పాడు సింహం మధ్యలో

వస్తే నన్ను చంపిపారేయదా? అన్నది. సింహం చాలా నీరసంగా ఉన్నది. అది నది కెళ్ళి రావాలంటే చాలా సేపుపడుతుంది. ఈలోగా నీవు కాస్త మాంసం తిను ఫరవాలేదు. అని తొడేలును బాగా ప్రోత్సాహించింది జిత్తుల మారి నక్క.

నక్క ప్రోత్సాహంతో తొడేలు గుర్రపు మాంసాన్ని కొంచెం కొంచెం తినసాగింది. ఇంతలో హఠత్తుగా సింహం స్నానం చేసి వచ్చేసరికి గుర్రాన్ని తింటున్న తొడేలు కనిపించింది.

దాంతో సింహానికి ఆగ్రహం గట్లు తెంచుకుని పెద్దగా గర్జించింది. సింహం ఆవేశం చూసి తొడేలు పుంజాలు తెంపుకొని అడవిలోకి పరారు అయ్యింది.

ఇంతలో వందల కొద్ది గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది. దాంతో సింహం నక్కను పిలిచి, ఆచప్పుడు ఏమిటో చూసిరా అన్నది. నక్క బయటికి వెళ్ళి చూసింది. అవి తప్పిపోయి అడవంతా తిరుగుతున్న అడవి గుర్రాలు అని గ్రహించింది నక్క–

సింహం దగ్గరకు వెళ్ళి ఓ రాజా! నీవు గుర్రాన్ని చంపావని అనేక వందల గుర్రాలు నిన్ను చంపాలని వస్తున్నాయి. నీకు చావు తప్పదు అని బెదిరించింది. దాంతో సింహానికి వణుకు పుట్టి ఆ గుహలోంచి అడవిలోకి పారిపోయింది. అప్పుడు నక్క తాపీగా గుర్రపు మాంసాన్ని హాయిగా ఒక నెలరోజులు భుజించింది.

నీతి : స్వార్థపరులకి స్నేహితులు ఉండరు.

మూర్ఖులకి సలహా ఇస్తే?

పూర్వం పాడేరు అడవులలో సంజీవి అనే బుల్, బుల్ పిట్ట ఒక పనస చెట్టు కొమ్మలపై నివాసం ఉండేది. ఆ పిట్ట నలుగురికి మంచి సలహాలు ఇస్తూ మంచి పేరు పొందింది.

ఒక చలికాలం చలి తీవ్రంగా ఉన్నది. మామూలు ప్రాంతాలలోనే చలికాలం చలి అధికం, అలాంటిది కొండలపైన ఉన్న పాడేరు అడవులలో చలి ఎలా ఉంటుందో వర్ణించటానికి వీలుకాదు.

అలాంటి సమయంలో నాల్గు కోతులు, ఆ అడవిలో చలికి తట్టుకోలేక గజ, గజ వణుకుతూ బుల్, బుల్ పిట్ట నివాసం ఉన్న పనస చెట్టు క్రింద ముడుచుకొని కూర్చున్నాయి. అలా చలికి వణికిపోతున్న కోతుల్లో ఒక పిల్ల కోతి ఇప్పుడు చలి మంట వేసుకుంటే బలే హాయిగా ఉంటుంది అన్నది.



పిల్లకోతి మాటలు విన్న ఒక ముసలి కోతి గబ, గబా నాల్గు చితుకులు పోగేసింది. ఇక చలి మంట కోసం నిప్పు కావాలి. నిర్మానుష్యమైన ఆ అడవిలో నిప్పు ఎవరిస్తారు కోతులు విచారించాయి. ఇంతలో వాటికి గాలిలో ఎగురుతూ తళ, తళమని మెరుస్తున్న మిణుగురు పురుగులు కనిపించాయి. వాటిని చూసి కోతులు నిప్పుగా భావించి రెండు మిణుగురు పురుగుల్ని పట్టి చితుకుల మధ్య ఉంచి నిప్పు రాజేయటానికి నోటితో ఊదసాగాయి.

నిజానికి మిణుగురు పురుగులు అలా మెరుస్తాయి కానీ వాటిలో ఎలాంటి నిప్పు మంట ఉండదు. కానీ ఈ విషయం అర్థం కానీ ఆ మూర్ఖపు మర్కటాలు చితుకుల్ని పడీ, పడీ ఊదసాగాయి. కానీ వాటి ఊపిరి పోయేదాకా వూదినా ఆ కట్టెలు మండలేదు. కోతులు చేస్తున్న ఈ బుద్ధిహీన చర్యలకి చెట్టు పైనున్న బుల్, బుల్ పిట్ట ఇలా అన్నది.

“ఓరీ మూర్ఖులారా! ఆ పురుగులు కట్టెల మధ్య ఉంచి, వూదితే నిప్పు రాజుకోదు. నా మాట వినండి–

మీ వృథా చర్యను మానండి. సరిగ్గా గుప్పెడంత కూడా లేని ఈ పాడు పక్షి, మాకు సలహా చెప్పేపాటిదా? పైగా మమ్మల్ని తెలివి తక్కువ వాళ్ళు అనినిందిస్తుందా... దీనికెంత ధైర్యం అని కోతులు వాటిలో అవి అనుకున్నాయి. కానీ ఆ పిట్ట అవేమీ పట్టించుకోకుండా ఓ బుద్ధిహీన మర్కాటలారా! నేను ఎంతగా చెప్పినా వినరేమిటి–

ఆ పురుగులని ఎంత ఊదినా నిప్పు రాజుకోదు అన్నది. అసలే భరించలేని చలి ఆపై ఎంత ఊదినా ఆ పురుగుల వల్ల నిప్పురాచుకోవటం